Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 28.07.2017, శుక్రవారం
సంపుటి : 37 సంచిక : 08
పేజీలు : 12, వెల : ₹ 5

కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# సీట్ల పెంపుకు తూట్లు

## • తూచ్ అంటున్న కేంద్రం • చంద్రులిద్దరిలో అయోమయం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు కీలకంగా మారింది. ఏపితో పాటు తెలంగాణలో కూడా అధికారపార్టీలు అసెంబ్లీ సీట్లను పెంచడానికి నానా తంటాలు పడుతున్నాయి. ఇందుకోసమే కేంద్ర ప్రభుత్వంతో ఎంతో సఖ్యతగా వుంటున్నాయి. సీట్లు పెరగడం ఆంధ్రాలో తెలుగుదేశంకు, తెలంగాణలో టీఆర్ఎస్‌కు ఎంతో అవసరం. ఈ రెండు పార్టీలు కూడా తమ రాష్ట్రాలలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయి. ఆంధ్రాలో అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు విలువలను తుంగలో తొక్కి పార్టీ ఫిరాయింపులకు ప్రత్యక్షంగానే పచ్చజెండా ఊపి వైకాపాకు చెందిన 20మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకున్నాడు. అలాగే తెలంగాణలో కేసీఆర్ కూడా పార్టీ ఫిరాయింపులను బ్రహ్మాండంగా ప్రోత్సహించాడు. కాంగ్రెస్, వైసిపి, టీడీపీల నుండి నాయకులను టీఆర్ఎస్‌లోకి భారీగానే లాక్కున్నాడు. ఇంతవరకు సమస్యలేదు. కాని, రేపు ఎన్నికల్లోనే వీరిద్దరికీ అసలు సమస్య ఎదురుకాబోతోంది. 2014 ఎన్నికల్లో ఈ రెండు పార్టీల్లోనూ గెలిచిన, ఓడిన అభ్యర్థులతో పాటు పార్టీలో కొత్తగా చేర్చుకున్న వారికి, గత ఎన్నికల్లో టిక్కెట్టివ్వకుండా రాబోయే ఎన్నికల్లో నీకే సీటు అంటూ గ్యారంటీ ఇచ్చిన వారికి రేపొచ్చే ఎన్నికల్లో సీట్లు అడ్జస్ట్ చెయ్యాలి. తెలంగాణలో 119, ఆంధ్రాలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. సీట్లు పెరగకపోతే తెలంగాణలో తన పార్టీలో నాయకులకు సీట్లు అడ్జస్ట్ చేయడం కేసీఆర్‌కు తలకు మించిన భారమే అవుతుంది. సీట్లు పెరగకపోతే తెలంగాణలో రాజకీయంగా కేసీఆర్‌కే (మిగతా 11వ పేజీలో)



## ఉపరాష్ట్రపతిగా... తొలి పర్యటన నెల్లూరులోనే!



- మొదట విజయం
- వెంటనే వెంకన్న దర్శనం
- ఆపై నెల్లూరు పయనం
- ఆగస్టు 7న మేధావులు, విద్యార్థులు, వెంకయ్య అభిమానులతో భారీ సభ
- 11న ప్రమాణస్వీకారం

(వివరాలు 12వ పేజీలో)



# బెట్టింగ్ బెండు తీస్తున్నారు!

- వణుకుతున్న అవినీతి పోలీసులు
- మంత్రి అనుచరుడికి బెట్టింగ్ సొమ్ము
- తీగ లాగేకొద్ది బయటకొస్తున్న పేర్లు

కొత్తకోట శ్రీనివాసరెడ్డి... *1999-2000 ప్రాంతంలో నెల్లూరుజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పనిచేసిన అధికారి. నెల్లూరుజిల్లా ప్రజలు ఇప్పటికీ ఆయనను మరచిపోలేదు. ఎందుకంటే అతనిని మరపించే విధంగా తర్వాత జిల్లాకు వచ్చిన ఏ ఎస్పీ కూడా పని చేయలేదు. కొందరు సమర్థులైన ఎస్పీలొచ్చినా శ్రీనివాసరెడ్డి లెవల్లో తమ పనితనం చూపలేకపోయారు. బహుశా రాజకీయ ఒత్తిళ్లు కూడా అందుకు కారణమైఉండొచ్చు.*

అప్పట్లో కమ్యూనిస్టు పార్టీలో వుండి నగరంలో పలు దందాలకు కారకుడైన మార్కెట్ నాగేశ్వరరావును అదుపులోకి తీసుకోవడంతో పాటు రౌడీషీటర్లు ఎర్రబాబు, నాటకరాణి మురళిల ఎన్‌కౌంటర్లు, రౌడీమేళాలు, నెల్లూరు నగరంలో ట్రాఫిక్‌ను దారికి తేవడం, ముఖ్యంగా కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో వుండి బాధితులకు నరకం చూపిస్తున్న సివిల్ వివాదాలను పరిష్కరించడం వంటి ముఖ్యఘటనలు ఎస్పీగా శ్రీనివాసరెడ్డిని నెల్లూరీయుల గుండెల్లో నిలిచేలా చేసాయి. శ్రీనివాసరెడ్డి వెళ్లిన తర్వాత జిల్లా పోలీస్‌శాఖలో ఆ జోష్ తగ్గిపోయింది. నిర్లిప్తత ఆవరించింది. క్రమక్రమంగా పోలీసుశాఖను అన్ని రకాల జాడ్యాలు ఆవహించాయి. మధ్యలో సెంథిల్‌కుమార్ వంటి ఎస్పీలు వచ్చి పోలీస్ పని చేశారు. ఎర్రచందనం స్మగ్లర్ల తొక్కపట్టి నారతీయసాగారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులను లోతుగా లాగితే అధికారపార్టీ నాయకుల జాతకాలు బయటపడే పరిస్థితులు రావడంతో, స్థానిక అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో సెంథిల్‌కుమార్ బదిలీ జరిగిపోయింది.

అయితే చాలా కాలానికి నెల్లూరుజిల్లాకు కరెక్ట్ ఎస్పీ దిగాడు. అడ్డదార్లు మరిగిన తన శాఖలోని అధికారులు, సిబ్బందికి చుక్కలు చూపిస్తున్నాడు. నెల్లూరు ప్రజలకి శ్రీనివాసరెడ్డిని మరిపించేలా పని చేస్తాడనే నమ్మకాన్ని (మిగతా 11వ పేజీలో)

శ్రావణ సంబరాలు...
FLAT
70% OFF
50% OFF | 20% OFF
ఫ్యాన్సీ, డిజైనర్ శారీస్, సల్వార్స్, డ్రస్‌మెటీరియల్స్, ఫ్యాన్సీ పావడాస్, వెస్ట్రన్‌వేర్‌పై...
Your World. Your Mall.
WOMAN'S WORLD
* T & C Apply
కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా, దర్గామిట్టా, జి.ఎన్.టి.రోడ్, నెల్లూరు. ఫోన్: 2316667

# నవ్వులపాలు కానున్న జగన్ వాగ్దానాలు

## - మంత్రి సోమిరెడ్డి ఎద్దేవా

ప్రతిపక్ష నేత జగన్ ఇస్తున్న ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు నవ్వుల పాలవుతున్నాయని, ఆ వాగ్దానాలను విని మేధావులు నవ్వుకునే పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం రాత్రి బోగోలు మండలంలోని కప్పరాళ్ళతిప్పలో 32 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన స్త్రీశక్తి భవనం, వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సాధ్యం కాని వాగ్దానాలను అమలు చేస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. తెలుగుదేశం పార్టీ రైతుల అభ్యున్నతిని కోరుకుంటోందని, అందుకే మూడేళ్ళలోనే కనీవినీ ఎరుగని రీతిలో వ్యవసాయరంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భారీగా నిధులను కేటాయించారన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణ సలహాకమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన చంద్రబాబు నాయుడును జీవితాంతం ముఖ్యమంత్రిగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్త్రీశక్తి భవన్‌లో ఫర్నిచర్ ఏర్పాటుకు బిఎంఆర్ ట్రస్ట్ నుంచి రెండు లక్షల రూపాయలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, కావలి నియోజకవర్గం మరింత ప్రగతిని సాధించేందుకు మంత్రి సోమిరెడ్డి సహకారం అందించాలని కోరారు. అనంతరం కోటి రూపాయల చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. మరో అయిదు కుటుంబాల వారికి చంద్రన్న బీమా పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లావణ్య వేణి, భక్తవత్సలరెడ్డి, ఏ.సి మంజుల, దేవరాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం అవినీతి మయం

## – వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి




తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో పాలన అవినీతికి అడ్డాగా మారిందని వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ నెల 25న నెల్లూరు మాగుంట లే అవుట్‌లో వున్న పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక కుంభకోణాలు జరుగుతున్నాయన్నారు. పసుపు కొనుగోలు పేరుతో కోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపారని, ధాన్యం కొనుగోలు కేంద్రాల పేరుతో పసుపు కొనుగోళ్లలో కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. పసుపు కుంభకోణంలో పసుపుచొక్కా వేసుకున్న వారు ప్రధానసూత్రధారులు కావడంతో వారిని ఈ కుంభకోణం నుంచి తప్పించమని అధికారులపై ఒత్తిడులు వస్తున్నాయని కాకాణి విమర్శించారు. దీంతో అధికారులు విచారణ కొనసాగిస్తున్నామని చెప్పడమే తప్ప ఇప్పటివరకు ఏ ఒక్కరి పైనా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో వెంకటాచలం జడ్పీటీసీ వెంకటశేషయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కామాక్షితాయి అన్నదానానికి రూ. 12లక్షలు


నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కొలువుదీరిన శ్రీమల్లిఖార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయ అన్నదానానికి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు రూ. 10లక్షలను విరాళంగా ఇచ్చారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ శంకర్‌రెడ్డి ఈ నెల 22వ తేదీ ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఇ.ఓ శివకుమార్‌ను కలిసారు. సంస్థ తరపున రూ. 10లక్షలు, జలంధర్‌రెడ్డి స్వయంగా 2లక్షల116 రూపాయలు విరాళంగా అందజేశారు.

## మాజీ సైనికులకు, వితంతువులకు హెల్త్‌కార్డ్స్

నెల్లూరుజిల్లాలోని మాజీసైనికులకు, వితంతువులకు వారిపై ఆధారపడిన వారికి 1995 ముందు ఆర్మీ, నేవి, ఎయిర్ ఫోర్స్‌లో పనిచేసి రిటైరైన వారికి ఎటువంటి రుసుము ప్రభుత్వానికి చెల్లించకుండా హెల్త్‌కార్డ్స్(ఎక్స్‌సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరి హెల్త్‌స్కీం) తీసుకోవచ్చని జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎక్స్ కెప్టెన్ పి.సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హెల్త్ కార్డుతో భారతదేశంలోని హాస్పిటల్స్‌లో ఎటువంటి రుసుమును చెల్లించకుండా ఉచితంగా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవచ్చున్నారు. ఇతర సమాచారం కొరకు 984819038, 0861-2328419 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## దివ్యాంగుల సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

స్వయం ఉపాధి పొందే దివ్యాంగులైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, కాపులు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 31వతేదీలోగా చేసుకోవాలని దివ్యాంగుల సేవాసంస్థ ఛైర్మెన్, కావలి సబ్‌డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు టి.సి.మాల్యాద్రి నాయుడు తెలిపారు. ఈ నెల 23వ తేదీ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం మూడుశాతం ఋణాలు మంజూరు చేయాలని జి.ఓ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఇందుకు బ్యాంకులు సహకరించాలని కోరారు. ప్రధానకార్యదర్శి జి.ఎస్.రాములు, జిల్లా ప్రధాన సలహాదారు సయ్యద్ ఘనీబాష, కార్యదర్శి హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌బికెఆర్‌లో నూతన వసతి భవనాలు

విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీకి 12వ ప్రణాళిక యుజిసి నిధులతోను, మేనేజ్‌మెంట్ ఆర్థికసాయంతోను నూతనంగా నిర్మించిన లేడీస్‌హాస్టల్ భవనానికి, డైనింగ్‌హాల్‌కు ఈ నెల 26న ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ డా.వి.వీరయ్య మాట్లాడుతూ, ఇక్కడి విద్యార్థినీ విద్యార్థులందరూ శ్రద్ధతో చదువుకుని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నూతన వసతి భవనం నిర్మాణానికి సహకరించిన కాలేజీ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థినుల సౌకర్యం కోసం నిర్మించిన ఈ వసతి భవన సముదాయాన్ని విద్యార్థినులు చక్కగా ఉపయోగించుకుని, విద్యలో ఉన్నతస్థాయిని అందుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కృష్ణమోహన్ మాట్లాడుతూ, వసతి భవనం నిర్మాణానికి సహకరించిన రామ్‌కుమార్‌రెడ్డి ఔదార్యాన్ని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో హెచ్‌వియుఎస్ సెక్రటరీ భక్తవత్సలరెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, యుజిసి కో-ఆర్డినేటర్ డా.వి.రాజా, డా.డి సుహృలత, డా.ఎం.శివయ్యతో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు

# అధ్యక్షుడిగా ఈపిఎస్



లయన్స్ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడిగా నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్ అధినేత యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్(ఈపిఎస్) ప్రమాణస్వీకారం చేశారు. ఈ నెల 23వ తేదీన నెల్లూరు, ముత్తుకూరురోడ్డులోని లయన్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షునిగా సురేష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, కె.ప్రవీణ్‌శంకర్, సి.రంగనాథ గుప్తా, కార్యదర్శిగా జి.శివకుమార్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బి.మురళీకృష్ణ, కోశాధికారిగా ఎం.వి.రామానుజం, సంయుక్త కోశాధికారిగా జి.శ్రీధర్‌లు ప్రమాణస్వీకారం చేశారు. అలాగే లయన్ లేడీస్ ఆక్సలరీ క్లబ్ అధ్యక్షురాలిగా శ్రీమతి యిమ్మడిశెట్టి జీవనగంగ, కార్యదర్శిగా జి.శిల్ప, కోశాధికారిగా ఎం.స్వర్ణమాల్యలు ప్రమాణస్వీకారం చేశారు. లయన్ అంబటి సుధాకర్‌రెడ్డి కొత్త కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు వై.అమృతవల్లి, ఎన్.వి.రమణయ్య, వై.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్, టి.చంద్రశేఖర్, బయ్యా శ్రీనివాసులు, పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షునిగా ఎన్నికైన యి.సురేష్‌కుమార్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు, మిత్రులు ఘనంగా సత్కరించారు.

# క్యాన్సర్ ఆసుపత్రికి రూ.4లక్షల విరాళం



నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి క్యాన్సర్ ఆసుపత్రికి మహావీర్‌జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ వారు రూ.4లక్షలు విరాళం అందించినట్లు ఆసుపత్రి ఏఓ శ్రీమతి రాజేశ్వరి తెలిపారు. ట్రస్టు అధ్యక్షుడు మోహన్‌లాల్‌జైన్, కార్యదర్శి జేపి జైన్, చంపాలాల్ జైన్, సభ్యులు పారస్‌మల్ జైన్, లలిత జైన్, మిశ్రిమల్ జైన్, ప్రకాష్‌జైన్, కిషోర్‌జైన్, ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మి పాల్గొన్నారు.

# సుందర నెల్లూరే మా స్వప్నం!

### - 'నుడా' ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానని 'నుడా' ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెలలో నెల్లూరు భక్తవత్సలనగర్ లోని సాయిబాబా గుడి సమీపంలో 'నుడా' కార్యాలయాన్ని రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు, కార్పొరేటర్లు, మున్సిపల్ ఛైర్మెన్‌లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారన్నారు. నుడా లోగో రూపకల్పనలో అందరి భాగస్వామ్యం అవసరమని, ఎవరైనా వారి ఆలోచనలను తెలపవచ్చని సూచించారు. మంచి లోగోను సూచించిన వారిని సన్మానిస్తామన్నారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది, ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేస్తామన్నారు. 'నుడా'లోగో, సూచనలు, సలహాలు పంపేందుకు వాట్సప్ నెంబర్ 9100197322, మెయిల్ సందేశాలను offline.nuda@gmail.comకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో నూనె మల్లిఖార్జునయాదవ్, నాయకులు ఆర్.కె.టి. శేషయ్య, పడవల కృష్ణమూర్తి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొయినుద్దీన్, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్, పిండి సురేష్, జలదంకి సుధాకర్, అంచూరి శ్రీనివాసులు నాయుడు, కె.బాలాజీ, వెంకటేశ్వర్లు నాయుడు, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో "టాటా టొయో" పరిశ్రమ



టాటా టొయో రేడియేటర్ లిమిటెడ్ నూతన ఉత్పత్తి కేంద్రాన్ని బుధవారం శ్రీసిటీలో ప్రారంభించారు. టాటా ఆటో కాంప్ సిస్టమ్స్‌కు చెందిన ఈ సంస్థ వివిధ వాహనాల్లో వినియోగించే రేడియేటర్లను తయారుచేస్తుంది. టాటా ఆటో కాంప్ ప్రెసిడెంట్ అరవింద్ గోయల్, సీఈఓ అజయ్ టాండన్ సమక్షంలో ఇసుజు ఇంజినీరింగ్ బిజినెస్ సెంటర్ ఛైర్మన్, ఎండీ హిరోయసు మూరా, టి రాడ్ కంపెనీ ప్రెసిడెంట్ హిరోమి కనో ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిరోయసు మూరా మాట్లాడుతూ, కస్టమర్లకు అత్యుత్తమ టెక్నాలజీతో మంచి ఉత్పత్తులను అందించేందుకు టాటా ఆటో కాంప్, టి రాడ్‌లు ఎప్పుడూ ముందంజలో ఉంటాయన్నారు. కస్టమర్లకు దగ్గరగా కంపెనీ ఏర్పాటు కావడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. హిరోమి కనో మాట్లాడుతూ, టాటా ఆటో కాంప్ భాగస్వామ్యంతో తమ కంపెనీ మంచి వృద్ధి సాధించడంతో పాటు, ఈ రంగంలో మరిన్ని ఉత్పత్తులు తీసుకురావడానికి వీలు కలుగుతుందన్నారు. టాటా టొయో దేశీయ మార్కెట్ షేర్ కూడా బాగా పెరుగుతుందన్నారు. ప్రతిష్టాత్మక టాటా గ్రూప్, జపనీస్ టి రాడ్ సంస్థలు సంయుక్తంగా శ్రీసిటీలో ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి హర్షం తెలిపారు. శ్రీసిటీకి మరిన్ని భారీ ఆటో మొబైల్ కంపెనీలు రాగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీలో ప్లాంటు ఏర్పాటు ద్వారా ఇక్కడి కస్టమర్లకు మరింతగా తమ సేవలందించే వీలు ఉంటుందని అజయ్ టాండన్ పేర్కొన్నారు. శ్రీసిటీకి ఉన్న ఎన్నో అనుకూలతల దృష్ట్యా తమ ప్లాంట్ ఏర్పాటుకు ఈ ప్రాంతాన్ని ఎన్నుకున్నట్లు గోయల్ తెలిపారు. 5 ఎకరాల్లో తమ కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# రిజిస్ట్రేషన్ ఛార్జీల బాదుడుకు రంగం సిద్ధం!

### ఆగస్టు 1 నుంచి పెంపు

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు ఇప్పటికే స్టాంపు డ్యూటీలు స్థలం కొనుగోలు చేసేంత పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలు సతమతమవుతుంటే, ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి స్థలాలు, భూములు, కట్టడాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నెల్లూరుజిల్లాలో స్థలాలు, భూముల విలువలను ఏరియాను బట్టి 10 నుంచి 25శాతానికి పెంచేందుకు అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసారు. నెల్లూరు నగరంలో ట్రంకురోడ్డు, చిన్నబజారు, పెద్దబజారు, ఆచారివీధి, ఆర్ఆర్ వీధి, మాగుంట లే అవుట్, సరస్వతినగర్, స్టోన్ హౌస్‌పేట, తదితర ప్రాంతాల్లో చదరపు గజం రేటును భారీగా పెంచారు. ఇక కమర్షియల్ ఏరియాల్లో కూడా గణనీయంగా పెంచారు. అలాగే కట్టడాల ధరలను చదరపు అడుగు రేటును పెంచారు. ప్రస్తుతం ఆర్‌సిసి చదరపు అడుగు ధర రూ.890 ఉండగా రూ.1060కి పెంచారు. యంటిసి చదరపు అడుగు రూ.480 ఉండగా రూ.530కి పెంచారు. ఏసిసి చదరపు అడుగు ధర రూ.480 ఉండగా రూ. 530కి పెంచారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు.




జులై 27వ తేదీ నెల్లూరులోని శివం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ హాల్లో ఇఫ్కో సెజ్‌వారు డిబిటి & జిఎస్‌టిపై నిర్వహించిన నెల్లూరుజిల్లా సహకార సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ ఆడిటర్ చిన్ని శ్రావణ్‌కుమార్, పక్కన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఇఫ్కో అధికారులు.

## 'ప్రభా'తం

# మత్తు వదలకుంటే... చిత్తే!

**మాదకద్రవ్యాలు (డ్రగ్స్) మనిషిని అధోగతి పాల్జేస్తాయి. ముఖ్యంగా యువత ఈ మత్తుకు బానిస అవుతోంది. దీనిని అరికట్టాలి. అయితే, ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన తెలుగు సినిమారంగంలోని కొంత మందికి కూడా ఈ డ్రగ్స్ వ్యవహారాలతో సంబంధాలుండడం దారుణం. దీనిపై సిట్ పూర్తిస్థాయిలో విచారణ జరపాలి. నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలి. డ్రగ్స్ మూలాలు వెలికితీసి, డ్రగ్స్ ముఠాల భరతం పట్టాలి. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయాలి.**

పూర్వకాలంలో ప్లేగు వ్యాధి అంటే ప్రపంచమే గడగడ వణికింది. ఇటీవలి కాలంలో ఎయిడ్స్ అంటే సమాజమే భయపడి పోయింది. ఇప్పుడు డ్రగ్స్ వాటిని మించిపోయింది. టాలీవుడ్‌కు సైతం అది వెన్నులో వణుకుపుట్టిస్తోంది. నిజమే!... మొన్నమొన్నటిదాకా మాదకద్రవ్యాలు (డ్రగ్స్) కేవలం మత్తునే కలిగిస్తుండేవి. అడిగేవారు, అదుపు చేసేవారూ లేకపోవడంతో మత్తుప్రియులదే ఇష్టారాజ్యంగా ఉండేది. ఇప్పుడా మత్తు దిగే రోజులొచ్చాయి.

మత్తు ఎంతో గమ్మత్తు అంటూ హాయిగా ఆ మత్తులో మునిగితేలేవారు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలోపడ్డారు. తెలుగుసినీ ప్రపంచమైతే డ్రగ్స్ మాటంటేనే బెంబేలెత్తిపోతోంది. ప్రధానంగా హైదరాబాద్‌లో పబ్‌ల సంస్కృతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. మాదకద్రవ్యాల వాడకానికి ఈ పబ్‌లు ఒక అడ్డాగా మారిపోయాయి. యువత ఈ మత్తులో పడిపోతోంది. జీవితాలు నాశనమవుతున్నాయి. దీంతో, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కొరడా పట్టుకుంది. దీంతో మత్తువాడేవారి గుండెలు గుభేల్‌మంటున్నాయి. డ్రగ్స్ వాడేవారి, దాంతో సంబంధాలున్నవారి మత్తు వదిలించేందుకు 'సిట్' సిద్ధం కావడంతో మత్తు ప్రియుల మతులు చెడుతున్నాయి. సిట్ విచారణ ఎంతైనా స్వాగతించదగ్గది. ఎందుకంటే, ఇప్పటికే అనేకమంది యువత, విద్యార్థులు, చివరికి పెద్దపెద్ద ప్రముఖులు కూడా డ్రగ్స్ మత్తులో పడి తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. అసలు ఈ డ్రగ్స్ ఎక్కడ నుంచి.. ఎవరినుంచి వస్తున్నాయి.. ఎవరు ఈ ప్రాణాంతకమైన మాదకద్రవ్యాలను వాడుతున్నారు.. అని తెలంగాణ ప్రభుత్వం ఆరా తీయడంతో తీగ లాగినట్లయింది. ఇప్పుడు డొంకంతా కలుగుతోంది.

తెలుగు సినీజగత్తులో ఉన్న కొందరికి కూడా ఈ డ్రగ్స్ వ్యవహారంతో సంబంధాలున్నాయనే సమాచారంతో 'సిట్' విచారణ ప్రారంభించడంతో..తామెక్కడ చట్టానికి దొరికిపోతామో అనే భయం ఆయా ప్రముఖులను వెంటాడుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే డ్రగ్స్ మాట వింటేనే టాలీవుడ్ దారెత్తిపోతోంది. మత్తుమందుల కేసులో అరెస్టయిన జాక్, డ్రగ్స్ దందా నడిపిన కెల్విన్ అరెస్టు తర్వాత ఎప్పుడు ఎవరి పేరు బయటకొస్తుందో, విచారణతో ఏం జరుగుతుందోననే భయంతో తెలుగు సినీరంగం గడగడలాడిపోతోంది. ఈ మత్తుమందుల కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతుండడం..డ్రగ్స్‌తో సంబంధాలున్నవారి కంటికి కునుకు రావడం లేదు. ఓ ప్రముఖ హీరోయిన్ వద్ద మేనేజర్‌గా ఉన్న వ్యక్తిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకోవడం, అతని వద్దనుంచి గంజాయి కూడా స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో ఒక ప్రముఖ దర్శకునితోపాటు, కొందరు సినీరంగ ప్రముఖులు కూడా సిట్ విచారణను ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకూ 27 మందిని విచారించామని, వారిలో 17 మంది నిందితులు, మరో 10 మంది ఇతరులు ఉన్నారని, 7 కేసులు నమోదయ్యాయని,ఈ నెల 24 నాటికి ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 19కి చేరిందని సిట్ అధికారులు స్పష్టం చేశారు. ఇంకా మరెంతమంది ఈ కేసులోకి వస్తారో తెలియదు. అయినా, రానురాను సమాజంలో పాశ్చాత్య విషసంస్కృతులు బాగా పెచ్చరిల్లిపోతున్నాయి. డబ్బు జబ్బుతో ఉన్నవారు కొందరైతే, ఆ జబ్బుతో మత్తును కొనుక్కొని మత్తులోనే మునిగిపోయేవారు మరికొందరు. టీనేజ్‌లో ఉన్నవారు, అందులోనూ డబ్బు బలంగా ఉన్నవారు జల్సాలకు అలవాటైపోయి, ఎంతోమంది ఈ మత్తు జబ్బుకు లోబడిపోతున్నారు. ఈ 'గమ్మత్తు'కు అమ్మాయిలు.. అబ్బాయిలు అనే తేడా ఏమీ లేదు. పెద్దలూ చిన్నలూ ఎవరైనా సరే దానికి ఒకటే. ఒకసారి తనను వాడుకుంటే చాలు..వారి జీవితాలను మసిచేసే దాకా అది వదలదు. అలాంటి విషరక్కసి మారురూపమే.. డ్రగ్స్. హైదరాబాద్ వంటి నగరాల్లో ఎప్పుడూ లేనంత విచ్చలవిడిగా పబ్‌ల సంస్కృతి వచ్చిపడడంతో, రకరకాల డ్రగ్స్ వాడకం కూడా విపరీతంగా పెరిగింది. మత్తుకు బానిసలవుతున్నవారు 60 నుంచి 70 శాతం మందిదాకా యువతే ఉంటున్నారంటే యువత ఎంత బలహీనపడుతోందో తేటతెల్లమవుతోంది. పబ్‌లు పెరిగిపోవడం, తాగి తందనాలాడడం, చిందులేయడం.. వయసుతో నిమిత్తం లేకుండా అన్ని వయసుల వారూ ఈ విషసంస్కృతికి అలవాటు పడిపోతుండడం.. ఎంత బాధాకరమో!..

అయినా, ఆ విషసంస్కృతి మాత్రం అడ్డూ అదుపూ లేకుండా సాగిపోతూనే ఉంది. ఇవన్నీ తెలిసి, సమాజం అలాంటి విషసంస్కృతి బారిన పడకుండా ప్రజలను చైతన్య వంతం చేసే సినిమా రంగంలోనూ డ్రగ్స్‌తో సంబంధాలున్నవారు ఉన్నారంటే ఎంత అప్రదిష్ట. ఇదేనా మన నీతి?.. ఇదేనా మన రీతి?.. చెప్పేదొకటి - చేసే దొకటిగా ఉంటే ఎవర్నయినా.. విశ్వసించే వారెవరు?... మద్యాన్ని మాదకద్రవ్యాలను వాడవద్దంటూ పదేపదే సినిమాల్లో చూపుతున్న.. అలాంటి డ్రగ్స్‌తో సంబంధాలు పెట్టుకోవడం సినీ రంగానికి ఎంత సిగ్గుచేటు!. అయినా, డ్రగ్స్.. అంటే అదొక మత్తు కాదు.. జబ్బు. యువతను, సమాజాన్ని పట్టి పీడించే భయంకరమైన జబ్బు. ఎయిడ్స్‌కంటే భయంకరమైనది. దీన్ని సమూలంగా నిర్మూలించి తీరాలి. ఆరోగ్యవంతమైన సమాజాన్ని మనకు మనమే నిర్మించుకోవాలి. అందుకు ప్రభుత్వాలతో పాటు, అన్నిరంగాల వారు, మేధావులు, ప్రజలంతా సహకరించాలి. మాదక ద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలి. మత్తెక్కించే మత్తును ఇకనైనా వదలకుంటే చిత్తైపోవడం ఖాయమని గుర్తించాలి!

ఏదేమైనా, సమాజాన్ని పెడమార్గం పట్టించే ఈ మత్తుమందుల కేసును పూర్తిస్థాయిలో విచారించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సందర్భంలో, ఈ మత్తుమందుల మూలాలు ఎక్కడున్నాయో, ఇంకా ఎక్కడెక్కడ విస్తరించాయో.. సిట్ మరింత లోతుగా దర్యాప్తు చేయాలి. యువతను నాశనం చేసే ఈ డ్రగ్స్‌ను పూర్తిగా నిరోధించి, డ్రగ్స్ ముఠాల భరతం పట్టాలి. డ్రగ్స్‌కు అడ్డాలుగా మారిన పబ్‌లపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఈ విచారణకు మరింత సార్థకత!

# చేనేతపై జీఎస్టీ ఎత్తివేయాలి

## గాంధీబొమ్మ వద్ద రాట్నం వడుకుతూ మహిళల ఆందోళన

చేనేతపై జీఎస్టీ ఎత్తివేయాలని, చేనేతకారుల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో నెల్లూరుకు తరలివచ్చిన చేనేత మహిళలు ఈనెల 23న నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద ధర్నాందోళన నిర్వహించారు. చేనేతకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు నాలుగు వందల మంది మహిళలు ఈ ఆందోళనలో పాల్గొని, గాంధీబొమ్మ వద్ద రాట్నం వడుకుతూ వినూత్నమైన రీతిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బుధవారపు బాలాజీ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు పదివేలకు పైగా చేనేత కుటుంబాలున్నాయని, చేనేతరంగమే వారికి ఉపాధి అంటూ, చేనేతకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో నేతన్నల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు లేక, చేనేతకు ఆదరణ కరువై చేనేత కుటుంబాల జీవనం అస్తవ్యస్తంగా తయారైందని వారు ఆందోళన చెందారు. చేనేతలకు



సంబంధించిన సర్వే లోపభూయిష్టంగా ఉందని, చేనేతకారులకు గుర్తింపుకార్డులను ఒకరికే ఇవ్వడం సముచితం కాదని వారన్నారు. చేనేతకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి, బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని కోరారు. చేనేత నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ, రోజంతా కష్టించి పనిచేసినా చేనేతకారులకు కూలి కూడా గిట్టుబాటు కావడంలేదని, దీంతో చేనేతకారులు తమ కుటుంబాలను పోషించు కోవాలంటే అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. చేనేతకారులకు పక్కా గృహాలు ఇవ్వాలని, 50ఏళ్ళు దాటిన చేనేతకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, చేనేత వస్త్రాలపై జీఎస్టీని ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మిడతల రమేష్ ధర్నాకు మద్దతు పలికారు. ఈ ధర్నాందోళనలో జిల్లా చేనేత సంఘం మహిళా కార్యదర్శి సిహెచ్ పద్మ, కోశాధికారి రామనాథంతోపాటు నాయకులు రాజశేఖర్, వేణుగోపాలయ్య, చొప్పా పద్మావతి, మార్కాపురం లక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.




## గౌరవించి అంగీకరించి ఉండాలి

బీజేపీ అధిష్ఠానం ఉపరాష్ట్రపతి పదవికి తన పేరును ప్రకటించగానే వెంకయ్యనాయుడు ఆ పదవిలోకి పోవడానికి అయిష్టత చూపారని మీడియాలో వచ్చింది. ఉపరాష్ట్రపతి పదవి అత్యున్నత రాజ్యాంగ రెండో పదవి. దానిని ఆయన ఎందుకు నిరాకరించాలి. పార్టీకి ఆయన చేసిన సేవకంటే, పార్టీయే ఆయనకు అనేక పదవులిచ్చింది. పార్టీని ఈ స్థాయిలో నిలబెట్టిన అద్వానీ వంటి సీనియర్ నాయకులనే ఈరోజు పక్కనపెట్టేసారు. అలాంటిది వెంకయ్యను గౌరవించి ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేసారు. ఆయన అయిష్టత చూపకుండా పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి సంతోషంగా అంగీకారం తెలిపి వుండాలి. ఆయన అలా చేయకుండా ఉపరాష్ట్రపతి పదవి అంటే ఇష్టం లేనట్లు మాట్లాడ్డం వల్ల ఎందుకు ఆయన ఇలా వ్యవహరిస్తున్నాడనే దానిపై ప్రజలకు ఎన్నో అనుమానాలొచ్చాయి.

**బట్టిరెడ్డి రమేష్‌రెడ్డి, నెల్లూరు.**

## సండే సంబరాలెందుకు?

దున్నపోతు ఈనిందంటే గుంజకు కట్టేయరా అన్నట్లుంది రాజకీయ నాయకులు, అధికారుల మదిలో వస్తున్న ఆలోచనలు. మన దేశంలో ఉద్యోగి ఆనందించని రోజులేదు. రెక్కాడితేగాని డొక్కాడదు అనే సామెతే పోయింది. అదనపు డబ్బురానిదే ఉద్యోగికి మానసిక ఉల్లాసము లేదు. మధ్యతరగతి, పేద పిల్లలకు పార్కులు ఆటవిడుపు స్థలాలు. వారికి ఖర్చులేని వినోదం. హ్యాపీసండే పేరుతో ఉద్యోగులు పార్కుల్లో పండుగలు చేసుకుంటే పేదపిల్లల సంతోషం పోతుంది. దయచేసి హ్యాపీసండేల పేరుతో పార్కులను పాడుచేయొద్దు. డబ్బులున్నోళ్లు ఆనందం కోసం ఎక్కడికైనా పోతారు. పేదపిల్లల ఆనందానికి పార్కులే దిక్కు.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## డ్రగ్స్ జగత్తు

హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియా ఎంతగా విస్తరించిందో చూస్తే భయమేస్తోంది. పోలీసు విచారణలో బయటకొచ్చినది కొన్నే! ఇంకా వెలుగులోకి రానివి చాలానే ఉన్నట్లున్నాయి. ముఖ్యంగా కాలేజీలలో విద్యార్థులపై నిఘా వుంచాలి. డ్రగ్స్ స్మగ్లర్లు ముందుగా ఆకట్టుకునేది విద్యార్థులనే! అలాగే సినీపరిశ్రమలో పలువురికి డ్రగ్స్‌తో సంబంధాలుండడం బాధాకరం. హైదరాబాద్‌లో కల్చర్ పేరుతో పాశ్చాత్య సంస్కృతి విచ్చలవిడిగా పెరిగింది. పబ్‌లతో, లేట్‌నైట్ పార్టీలలో డ్రగ్స్ వాడుతున్నట్లుగా తెలుస్తోంది. పోలీసులు ఉక్కుపాదం మోపితేగాని డ్రగ్స్ కల్చర్ నుండి హైదరాబాద్‌ను విముక్తి చేయలేము.

**- విష్ణు సతీష్‌రెడ్డి, హైదరాబాద్.**

## వ్యాపారాలు దెబ్బతిన్నాయి

నరేంద్రమోడీ ప్రధాని అయితే, దేశం తలరాత మారుతుందనుకున్నారు. కాని జనం బ్రతుకులు తలక్రిందులయ్యాయి. గత ఏడాది నవంబర్‌లో చేసిన పెద్దనోట్ల రద్దు వల్ల రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యింది. ఇప్పుడు తలా తోక లేకుండా అమలులోకి వచ్చిన జిఎస్‌టితో వ్యాపారుల పరిస్థితి మూలిగేనక్క మీద తాటికాయ పడ్డట్లయ్యింది.

**- గాదంశెట్టి కిషోర్, నెల్లూరు.**



## వెంకయ్య పదవి మార్పుతో...

# ఆర్థికంగా నష్టం... ఆత్మీయులకు కష్టం!

**భారతదేశ రెండో అత్యున్నత పదవైన ఉపరాష్ట్రపతిగా మన నెల్లూరీయుడు యం.వెంకయ్యనాయుడు ఎంపిక కాబోతున్నందుకు మనమంతా ఆనందించాల్సిందే! అయితే అదే సమయంలో ఆయన రాజ్యాంగ పదవిలో కూర్చుంటే నెల్లూరు ప్రజల గురించి గాని, నెల్లూరుజిల్లా అభివృద్ధి గురించి గాని ఆలోచించేంత పరిధి ఆయనకు వుండదు. దేశ ఉపరాష్ట్రపతిగా ఆయన తన ఊరు, తన మండలం, తన జిల్లా గురించి ఆలోచించలేడు. అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి రావాల్సిన నిధుల పరంగానూ, అభివృద్ధి ప్రాజెక్ట్‌ల పరంగానూ వెంకయ్య ఉపరాష్ట్రపతి కానుండడం నెల్లూరుకు నష్టమే!**

వెంకయ్య రాజకీయాల్లో వుంటే అప్పుడప్పుడు జిల్లాలో సందడిగా వుండేది. నెలకో, రెండు నెలలకో ఓసారి వెంకయ్య జిల్లాకు వస్తుండేవాడు. వచ్చేటప్పుడు ఎవరో ఒక కేంద్రమంత్రిని, ఏదో ఒక ప్రాజెక్ట్‌ను వెంట బెట్టుకుని వచ్చేవాడు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఠంఛన్‌గా సేవా కార్యక్రమాలు జరిపించేవాడు. 1999-2004ల మధ్య వాజ్‌పేయి ప్రభుత్వంలో ఆయన గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా ఉన్నప్పుడైతే ఆ నాలుగున్నరేళ్ళ కాలంలో 38మంది కేంద్రమంత్రులను నెల్లూరుకు తీసుకువచ్చాడు. ప్రధాని, ఉప ప్రధాని, ఆయా రాష్ట్రాల సీఎంలను కూడా తీసుకువచ్చాడు. ఇక స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో జరిగే సంక్రాంతి, ఉగాది సంబరాలకైతే ప్రఖ్యాత సినిమా స్టార్స్ రావడం తెలిసిందే! గడచిన మూడేళ్లలో కూడా జిల్లాకు ఎందరో కేంద్ర మంత్రులను, సినీప్రముఖులను తీసుకొచ్చారు.

ఇక అభివృద్ధి పరంగా చూస్తే చంద్రబాబు జిల్లాపై సీత కన్నేయడం తెలిసిందే! 2014 ఎన్నికల్లో ఈ జిల్లాలో సీట్లు తక్కువొచ్చాయని చెప్పి చంద్రబాబు అలిగాడు. ఈ జిల్లాలో తమ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారని వెంకయ్యనాయుడు కూడా మనస్థాపం చెంది కేంద్రమంత్రి అయ్యాక కొద్దిరోజులు జిల్లాకే రాలేదు. చంద్రబాబుకు ఇది సొంత జిల్లా కాదు కాబట్టి అలాగే కరుడుగట్టిన వాడిలా వున్నాడు. వెంకయ్యకు ఎంతైనా సొంత జిల్లా మీద ప్రేమ వుంటుంది కదా! ఎంతకాలమని జిల్లా మీద అలిగి ఉండగలడు? జిల్లాపై అలకమాని జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టాడు. కృష్ణపట్నం పోర్టును ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీగా చేయడంలో ఆయన కృషి ఉంది. నెల్లూరును స్మార్ట్‌సిటీగా ప్రకటించడంతో పాటు నగరాన్ని అమృత్ పథకంలో చేర్చి కేంద్రం ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నారు. నెల్లూరు చెరువును 'అమృత్' స్కీంలోనే ట్యాంక్‌బండ్‌లెవల్లో తీర్చిదిద్దడానికి మొదట 36కోట్లు కేటాయించారు. వెంకయ్య చొరవతో ఆ బడ్జెట్‌ను దాదాపు 90కోట్లు చేసినట్లుగా తెలుస్తోంది. ఈ ట్యాంక్‌బండ్ పూర్తయితే నెల్లూరు నగర అందాలను పెంచే కంఠాభరణం అవుతుంది. నెల్లూరులో తాగునీటి సమస్యను శాశ్వతంగా రూపుమాపడానికి గాని, భూగర్భ డ్రైనేజీ కోసంగాని హడ్కో ద్వారా నెల్లూరుకు 1100కోట్లు ఋణం మంజూరు చేయించడంలో వెంకయ్య పాత్ర చాలా కీలకం. ఇవికాకుండా టూరిజం పరంగా, హౌసింగ్ పరంగా మరికొన్ని ప్రాజెక్ట్‌లు తెచ్చారు. కృష్ణపట్నం కేంద్రంగా సెజ్‌ను ఏర్పాటు చేయించి తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. వెంకయ్య కేంద్రమంత్రిగా వుండుంటే రాబోయే రెండేళ్లలోనూ జిల్లాకు మరిన్ని పథకాలు, నిధులు బాగానే వచ్చుండేవి. కాని, రేపు ఆయన ఉపరాష్ట్రపతిగా వెళ్లిపోతే నెల్లూరుజిల్లా అభివృద్ధి గురించి ఆలోచించేవాళ్లుగాని, పరపతి ఉపయోగించి నిధులు తేగలిగిన వాళ్ళు గాని ఇంకెవరున్నారు?





# అవినీతిపై దద్దరిల్లిన జడ్పీ



ఈ నెల 23వ తేదీన నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశం అధికార, విపక్ష సభ్యుల పరస్పర విమర్శలు, ఆరోపణలతో దద్దరిల్లింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంలోనూ, తమపై వచ్చిన విమర్శలను తిప్పికొట్టడంలోనూ నాయకులు తమ టాలెంట్‌నంతా చూపించారు. ఇఫ్కో కిసాన్ సెజ్ భూముల అక్రమాలు, నీరు-చెట్టు పనుల్లో అవినీతి, పసుపు కొనుగోళ్ల వ్యవహారంతో సభలో దుమారం రేగింది. జడ్పీలో జడ్పీటీసీలు, ఎంపీటీసీల కంటే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే ఎక్కువుగా మాట్లాడి సమావేశాన్ని హైజాక్ చేసారు. ముఖ్యంగా ఉదయగిరి నియోజకవర్గం కేంద్రంగా జరిగిన ఫైబర్ చెక్‌డ్యాంల అవినీతి, పసుపు కొనుగోళ్లలో పసుపునేతల దందాపై వైసిపి ఎమ్మెల్యేలు, సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కొడవలూరు జడ్పీటీసీ ఇరువూరు శ్రీధర్‌రెడ్డి ఇఫ్కో కిసాన్ సెజ్‌లో జరుగుతున్న అక్రమాలను సమావేశంలో లేవనెత్తాడు. కిసాన్ సెజ్‌కు 3,370ఎకరాల భూమిని సేకరించి, కేవలం 242ఎకరాలకే నష్టపరిహారం ఇచ్చారని, మిగతా భూములకు నష్టపరిహారం ఇవ్వకుండానే పరిశ్రమలకు కట్టబెడుతున్నారని, ఈ సెజ్ భూముల వ్యవహారంలో కోట్ల రూపాయలు దుర్వినియోగం జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇఫ్కో కిసాన్‌సెజ్ భూములకు సంబంధించి సమావేశంలో పెద్ద వాగ్యుద్ధమే జరిగింది. ముఖ్యంగా వైసిపి ఎమ్మెల్యేలు వివిధ అంశాలపై తీవ్రస్థాయిలో దాడి చేశారు. టీడీపీ నుండి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కొంతవరకు వారి దాడిని ఎదుర్కొనే ప్రయత్నం చేశారు.

జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్‌ఛైర్మెన్ పి.శిరీష, కలెక్టర్ ముత్యాలరాజు, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## నంద్యాల ఎన్నికల్లో...

# సోమిరెడ్డికి కీలక బాధ్యత



ముఖ్యమంత్రి చంద్రబాబును నంద్యాల ఉప ఎన్నిక భలే టెన్షన్ పెడుతోంది. ఇంతవరకు నంద్యాల ఉపఎన్నికకు సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేయకపోయినా, చంద్రబాబు మాత్రం ఈ ఎన్నిక కోసం సర్వశక్తులొడ్డుతున్నాడు. ప్రతిరోజూ రాష్ట్ర పరిపాలన కోసం కేటాయిస్తున్న సమయం కంటే కూడా నంద్యాల కోసం ఆయన కేటాయిస్తున్న సమయం ఎక్కువుగా వుంది. నంద్యాలలో గెలుపు కోసం ఆయన పడని తంటాలు లేవు. స్థానిక ముస్లిం నేత ఫరూక్‌కు ఎమ్మెల్సీ ప్రకటించాడు. కాపుల ఓట్ల కోసం కమ్యూనిటి హాల్‌కు శంకుస్థాపన చేసాడు. 13వేల ఎన్టీఆర్ ఇళ్ళు మొదలుపెట్టించాడు. ప్రజలపై వందలకోట్ల హామీలు కుమ్మరిస్తున్నాడు. నంద్యాల ఉపఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోతే భవిష్యత్‌లో ఏం జరుగుతుందో ఆయనకు తెలుసు. అందుకే గెలుపు కోసం ఏ చిన్న అవకాశాన్ని, ఆధారాన్ని కూడా ఆయన వదులుకోవడం లేదు. నంద్యాల నియోజకవర్గ పరిధిలో ముస్లింలు, రెడ్లు, వైశ్యులు, కాపులు గెలుపోటములను శాసిస్తారు. ముస్లింలను కవర్ చేయడానికి ఫరూక్‌ను, వైశ్యుల కోసం టి.జి. వెంకటేష్‌ను చంద్రబాబు రంగంలోకి దించారు. ఈ నియోజకవర్గంలో 'రెడ్డి' సామాజిక వర్గం ఓట్లు చాలా కీలకం. పార్టీల పరంగా చూసుకుంటే ఈ సామాజికవర్గంలో దాదాపుగా 70శాతం ఓట్లు వైకాపాకే పోతాయి. అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుంటే మాత్రం ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వాళ్ళు కాబట్టి పోటాపోటీగా ఉంటుంది. 'రెడ్డి' సామాజికవర్గం ఓట్ల కోసం మొదట మంత్రులు ఆకే అమర్‌నాథ్‌రెడ్డిని, దేవగుడి ఆదినారాయణరెడ్డిలను నంద్యాల పంపారు. అయితే ఇద్దరు కూడా వైసిపి నుండి వెళ్లిన వాళ్లే కావడంతో వీరి పట్ల వ్యతిరేకత ఏర్పడింది. వీళ్ల వల్ల పార్టీకి ప్రయోజనం కలగకపోగా నష్టం వాటిల్లే పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా ఆదినారాయణ రెడ్డి వియ్యంకుడు కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత

(మిగతా 11వ పేజీలో)

# పారిశుద్ధ్యాన్ని పట్టించుకోని కార్పొరేషన్



\- ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు నగరంలో పారిశుద్ధ్య పరిస్థితి పరమ అధ్వాన్నంగా తయారైనా కార్పొరేషన్ వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. నగరంలోని రాజన్నభవన్‌లో ఈ నెల 23న ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి కార్పొరేషన్ వైఫల్యాలను తీవ్రంగా నిరసించారు. ఇటీవల నగరంలోని వెంకటేశ్వరపురంలో డెంగ్యూ వ్యాధితో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని, మరో చిన్నారి తీవ్ర అస్వస్తతకు గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతోందని పేర్కొన్నారు. ఎక్కడ చూసినా మురికి వాతావరణం, మురుగు నిల్వలు పేరుకుపోతుండడంతో నగరమంతా అపరిశుభ్రంగా తయారైందని, దోమలు విపరీతమై నానా రకాల వ్యాధులు ప్రజలను చుట్టుముడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరంలో పరిశుభ్రత నెలకొల్పేందుకు కార్పొరేషన్ తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేందుకు సెప్టెంబర్ 2వతేది నుంచి తాను గడప గడపకు వస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గడప గడపకు కార్యక్రమం షెడ్యూలును త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దేవరకొండ అశోక్, నాయకులు కొణిదెల సుధీర్, కర్తం ప్రతాప్‌రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.






# దడ పుట్టిస్తున్న ఇసుక ట్రాక్టర్లు

నెల్లూరు నగరవాసులను ఇసుక ట్రాక్టర్లు హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా పొట్టేపాలెం రీచ్ నుండి ఇసుకలోడ్‌తో వచ్చే ట్రాక్టర్లు నగరంలోని అన్ని ప్రాంతాలకు పోతుంటాయి. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఇసుక ట్రాక్టర్లను నగరంలోకి అనుమతిస్తున్నారు. ఆ టైంలో ట్రాక్టర్లను నెల్లూరు రోడ్ల మీద విమానాల్లా నడుపుతుంటారు. వీటికి సరిగా బ్రేకులు కూడా పడవు. సడెన్‌గా ఎవరన్నా అడ్డమొచ్చినా, ఏదన్నా వాహనం వచ్చినా గుద్దుకునిపోవాల్సిందే! నడిరోడ్లపై వీటి వీరవిహారానికి దారినపోయే పాదచారులు హడలిపోతున్నారు.

దీనికితోడు ఇసుకపైన పట్టలు కప్పరు. దాంతో గాలికి ఇసుక రేణువులు వచ్చి వెనుకవచ్చే వాహనదారుల కళ్లల్లో పడుతున్నాయి. రాత్రివేళల్లో మాత్రమే ఇసుక ట్రాక్టర్లు నగరంలోకి వచ్చే విధంగా ఎస్పీ ఆలోచిస్తున్నారని తెలుస్తోంది. ఆయన ఈ పని చేస్తే నగరవాసుల నెత్తిన పాలు పోసినట్లే!

# బొమ్మిరెడ్డి జన్మదిన వేడుకలు



నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి జన్మదిన వేడుకలు ఈ నెల 24వ తేదీ జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పలు మండలాల ఉద్యోగులు, ప్రధాన కార్యాలయ సిబ్బంది జడ్పీ ఇన్‌ఛార్జ్ సిఇఓ వసుమతి, ఇతర విభాగాల అధికారులను ఆహ్వానించి భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపీకి చెందిన వివిధ స్థాయిల నేతలు జిల్లా పరిషత్‌కు చేరుకుని ఛైర్మెన్ చేత వేర్వేరుగా కేక్‌లు కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ర్యాగింగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

## – బీద రవిచంద్ర పిలుపు




ఆంధ్రప్రదేశ్‌ను ర్యాగింగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు టిఎన్‌ఎస్‌ఎఫ్ కృషి చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పిలుపునిచ్చారు. నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులో వున్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ర్యాగింగ్‌ను పూర్తిగా నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సాయికిషోర్, యజ్ఞానీ, అఖిల్, మహేంద్రబాబు, ప్రమోద్, షారూఖ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదును పరిశీలించిన జేసీ



జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ ఆదివారం నెల్లూరు, బి.వి. నగర్‌లోని కె.ఎన్.ఆర్. మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలులో జరుగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఓటర్ల నమోదులో ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలు తప్పక పాటించాలని అక్కడి సిబ్బందికి జేసీ సూచించారు. అనంతరం అక్కడి హైస్కూలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులలోని విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఒక క్రమపద్ధతిలో విద్యాభ్యాసం చేయాలని ఆయన సూచించారు. అనంతరం బి.వి.నగర్‌లో డ్యామ్యెన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కుష్టు, టి.బి. ఆసుపత్రిని ఆయన సందర్శించారు. జనావాసాల మధ్య నడపబడుతున్న ఆ ఆసుపత్రి వల్ల కాలుష్యంతో పాటు అంటురోగాలు ప్రబలుతున్నాయని అక్కడి ప్రజలు చేసిన ఫిర్యాదుపై ఆయన ఆసుపత్రిని సందర్శించి తనిఖీ చేశారు. తమ సంస్థకు మరొక ప్రదేశంలో స్థలాన్ని కేటాయిస్తామని జాయింట్ కలెక్టర్ సూచించగా... ఆసుపత్రి విదేశీ నిధులతో నడుస్తుందని, తాము వారి అనుమతి తీసుకుంటామని వారు జాయింట్ కలెక్టర్‌కు తెలిపారు.



# మళ్ళీ ఠారెత్తిస్తున్న ఎండలు

నిన్న మొన్నటి దాకా సన్నటిజల్లులతో సాయంత్రమైతే వీచే చల్లటి గాలులు, ఉరుములు, మెరుపులతో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా అనిపించింది. ఆకాశం మబ్బులు పట్టి వాతావరణం చల్లగా ఉండేది. కాని గత వారంరోజుల నుండి ఎండలు మళ్లీ తాట తీస్తున్నాయి. మిట్ట మధ్యాహ్నం రోడ్ల మీద నడవలేని పరిస్థితి. ఉక్కపోత భయంకరంగా వుంది. ఎండలు తగ్గినట్లే తగ్గి మళ్లీ విజృంభించడంతో జనం అల్లాడుతున్నారు.

## శ్రీ రంగనాధస్వామి ఆలయ

# ఇ.ఓగా జనార్ధనరెడ్డి

నెల్లూరులోని సుప్రసిద్ధమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాధస్వామి ఆలయం ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారిగా కోవూరు జనార్ధనరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జనార్ధనరెడ్డి తూర్పు కనుపూరు గ్రామంలోని ముత్యాలమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్నారు. శ్రీరంగనాధస్వామి దేవస్థానం ఇ.ఓగా ఉన్న పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ కావడం, ఏసిబి న్యాయస్థానం ఆయనకు 14రోజుల రిమాండ్ విధించిన నేపథ్యంలో, దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శ్రీ రంగనాధస్వామి ఆలయ బాధ్యతలు కోవూరు జనార్ధనరెడ్డికి అప్పగించడం జరిగిందని రవీంద్రరెడ్డి తెలియజేశారు.

## నెల్లూరు కబుర్లు

# శివార్లపై నిఘా కళ్ళు



నేరాలకు అడ్డాగా మారుతున్న నెల్లూరు నగర శివార్లపై పోలీసులు దృష్టిపెట్టారు. నెల్లూరు నగరంలో జరిగిన ఎన్నో నేరాలకు నగరం చుట్టుపక్కల వుండే దొంతాలి, కొత్తూరు, నరసింహకొండ, పొట్టేపాలెం, వెంకటేశ్వరపురం, పోతిరెడ్డిపాలెం, జనార్ధన్‌రెడ్డి కాలనీ, ధనలక్ష్మీపురం వంటి శివారు ప్రాంతాలు సాక్ష్యంగా నిలిచాయి. నగరంలో హత్య జరిగితే శివార్లలో మృతదేహాలు దొరికేవి. అలాగే అత్యాచారాలకు, ఇతర చీకటి పనులకు శివారు ప్రాంతాలు అడ్డాగా వుండేవి. వీటిని అరికట్టడానికి రూరల్ పోలీసులు నడుం కట్టారు. రూరల్ డిఎస్పీ కె.వి.రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శివారు ప్రాంతాల్లో నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. సి.సి కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు తగ్గుముఖం పట్టడంతో పాటు అక్రమరవాణాను కూడా అరికట్టవచ్చు.

# 'యాదే రఫీ' మ్యూజికల్ నైట్ 30న

మధురగాయకుడు పద్మశ్రీ మహమ్మద్ రఫీ 37వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డులో వున్న అనిల్‌గార్డెన్స్‌లో 'యాదే రఫీ' మ్యూజికల్‌నైట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ మేరకు ఆహ్వాన పత్రికలను ఈ నెల 23న మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ




సందర్భంగా ముంగమూరు మాట్లాడుతూ, గత 24ఏళ్ళుగా మహమ్మద్ రఫీని స్మరించుకుంటూ మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో మ్యూజికల్‌నైట్‌ను నిర్వహిస్తుండడం ఎంతైనా అభినందనీయమన్నారు. నుడా డైరెక్టర్ ఖాజావలి మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన మహమ్మద్ రఫీ పాటలను ప్రముఖ గాయకులు ఎహ్‌తెషామ్, సిమ్రన్, గౌస్‌బాషా, మహమ్మద్ అస్లాం, సుజాత, శిరీష, ఖయ్యూమ్ తదితరులు ఆలపిస్తారని తెలిపారు. ఈ మ్యూజికల్‌నైట్‌కు విచ్చేసేవారు ముందుగా కాంప్లిమెంటరీ పాస్‌లను తీసుకుని హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌పాషా, జాకీర్, అక్రమ్, నౌషాద్, కరిముల్లా, సందాని పాల్గొన్నారు.

# ఉత్సాహంగా హ్యాపీసండే


నెల్లూరు అర్‌ఎస్‌ఆర్ స్కూల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హ్యాపీసండే కార్యక్రమాన్ని ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఢిల్లీరావు మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతిరోజూ పని ఒత్తిడిలో ఉండే ప్రజలకు ఆదివారం ఆటవిడుపు ఎంతైన అవసరమన్నారు. అనంతరం లెమన్‌స్పూన్, ఏబిసిడి, మ్యూజికల్ ఛైర్ తదితర ఆటల్లో ఉద్యోగులు, నగరవాసులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కిన్నెరప్రసాద్, రాఘవయ్య నాయుడు, నగర పాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, ఆర్‌ఎస్‌ఆర్ వాకర్స్ పాల్గొన్నారు.

# కారంశెట్టి ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

## – డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరులోని కారంశెట్టి వెంకట్రామయ్య ఫౌండేషన్‌వారు చేపడుతున్న విద్యాప్రగతి కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని, ఈ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. నెల్లూరు రంగనాయకులపేటలోని జిల్లా ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కారంశెట్టి వెంకట్రామయ్య ఫౌండేషన్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 10వ తరగతి, ఇంటర్‌లలో ప్రతిభ చూపిన 30 మంది విద్యార్థులకు పలువురు ప్రముఖులు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, నెల్లూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రెండు ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించనున్నామన్నారు. అదేవిధంగా నగర పరిధిలో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఐల్యాండ్‌లను తొలగిస్తామన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, నెల్లూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని తదితర సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఈ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కారంశెట్టి వెంకట్రామయ్య, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, ఫౌండేషన్ ట్రస్టీ కారంశెట్టి ప్రవీణ్‌కుమార్‌లతో పాటు ప్రముఖులు దాసా సురేష్‌రాజా, అమరా మోహన్‌రావు, కెవి చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

*ఒక రాజకీయ నాయకుడు ఎక్కడ ఫైన్ అవుతాడు... పోలీసుస్టేషన్‌లోకి పోవాలి, ఎస్ఐతోనో, సిఐతోనో మాట్లాడి తమ వాళ్ల మీద కేసులు ఎత్తేయించాలి. పెద్దకేసులైతే ఎస్పీకి ఫోన్ చేసి చెప్పగలగాలి. మండలాల్లో ఎమ్మార్వోగా విఆర్ఓగా తమ అనుచరులకు పనులు చేసేవాళ్లను పెట్టుకోవాలి. సదరు అధికారపార్టీ నాయకుడి నుండి ఫోన్ రాగానే ఎమ్మార్వో వద్ద గాని, విఆర్ఓ వద్ద గాని పనయ్యేటట్లుండాలి. కార్పొరేషన్, మున్సిపాల్టీల పరిధిలో నాయకులకయితే కమిషనర్ గాని, సంబంధిత మున్సిపల్ అధికారులు గాని చెప్పగానే పని చేసేటట్లుండాలి. సాధారణంగా ఏ ప్రభుత్వంలో అయినా ఎక్కువ శాతం మంది అధికారులు అధికార పార్టీ నాయకుల మాటకు విలువిస్తుంటారు. వారు చెప్పిన పనులను చేస్తుంటారు.*




## సినిమా చూపిస్తున్న అధికారులు...

# సందిగ్ధంలో అధికార నేతలు

కాని, ఇప్పుడు జిల్లాలో అధికారపార్టీ నాయకులకు పెద్ద చిక్కొచ్చిపడింది. జిల్లా కలెక్టర్‌గా వున్న ముత్యాలరాజు ముక్కుసూటిగా పోతున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొంచడం లేదు. మండల స్థాయిలో అధికారపార్టీ వాళ్లకు ఎమ్మార్వోలు, ఆర్ఐలు, విఆర్ఓలు, సెక్రటరీల వంటి ఉద్యోగులు చాలా కీలకం. మండల స్థాయి నాయకులు వారిచేత పని చేయించుకోగలిగితేనే వీరి వెనుక కేడర్ నిలబడుతుంది. ఆర్ఐలు, విఆర్ఓల వంటి ఉద్యోగుల బదిలీలను వీళ్లు చేయించగలిగితేనే, స్థానికంగా ఆ నాయకులకు పట్టున్నట్లు కలరింగ్ ఇస్తారు. అయితే కలెక్టర్ ముత్యాలరాజు వద్ద అలాంటి పప్పులుడకడం లేదు. రెవెన్యూ శాఖ ఉద్యోగుల బదిలీలలో ఆయన ఏ రాజకీయ నాయకుడినీ వేలు పెట్టనీయలేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా తాము కోరుకున్న వారికి బదిలీ వేయించడంలో విఫలమయ్యారు.

కలెక్టరే అడ్డనుకుంటే ఇప్పుడొచ్చిన ఎస్పీ ఇంకా మొండిగా వున్నాడు. అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు కలెక్టర్ దాకా సిఫార్సులన్నా తీసుకెళుతున్నారు. కాని ఏదన్నా పనిమీద ఎస్పీకి ఫోన్ చేయడానికి జంకుతున్నారు నాయకులు. ఎస్పీ రామకృష్ణ గురించి జిల్లాలో అందరు నాయకులకు తెలిసిపోయింది. పద్ధతైన పనయితే ఎవరు ఫోన్ చేసినా సానుకూలంగానే స్పందిస్తాడు. అదే అడ్డగోలు పనైతే ఎవరికైనా సమాధానం ఒకే రీతిలో ఉంటుంది. కాబట్టే ఎవరూ నేరుగా ఎస్పీకి ఫోన్ చేయడం గాని, ఏదన్నా పని మీద కలవడం గాని చేయడం లేదు. ఎస్పీ దెబ్బకు జడిసి సిఐలు, ఎస్ఐలు కూడా అధికారపార్టీ నాయకులు ఏ పని చెబితే ఆ పని చేయడంలేదు. సక్రమమైన పనులంటేనే చేస్తున్నారు. కేసు సక్రమంగా వుంటే అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముంటుంది? అడ్డగోలు పనులు చేయడానికే కదా అనుచరులు వాళ్ల వెనుక తిరిగేది! కాని పోలీసుస్టేషన్‌లలో అధికారపార్టీ నాయకుల మాట చెల్లుబాటు కావడం లేదు. స్థానికంగా అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నా కూడా... ఎస్ఐలు, సిఐలు లెక్కచేయడం లేదు. మేం రూల్స్‌ను అతిక్రమించి ఏ పనీ చేయం. మీకు చేతనైతే ఎస్పీ చేత చేయించుకోండి, మీకు మేం పని చేయడం లేదనుకుంటే మమ్మల్ని ట్రాన్స్‌ఫర్ చేయించుకోండని తెగేసి చెబుతున్నారు. అలాగే నెల్లూరు నగరంలో కార్పొరేషన్ కమిషనర్ కూడా అధికారపార్టీ నాయకులకు మింగుడు పడడం లేదు. కమిషనర్ ఢిల్లీరావు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగడం లేదు. దీంతో కార్పొరేషన్‌లో అక్రమ మార్గాల్లో పనులు చేసుకుంటున్న అధికారపార్టీ నాయకులకు బ్రేక్ పడినట్లయ్యింది. జిల్లాలో గట్టి ఉన్నతాధికారులుండడంతో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకుల ఆటలు సాగడం లేదు.

# వ్యాపారం చేస్తే తప్పేంటి?



## ☝ పసుపుపై పసుపునేతలది ఒకే మాట

***గత రెండు వారాలుగా జిల్లాలో పసుపు కొనుగోలు వ్యవహారంపై పెద్ద రచ్చ జరగడం చూస్తూనే వున్నాం. పసుపు కొనుగోళ్లలో అక్రమాలు అంటూ మీడియాలోనూ ఒకటే వార్తలు. దీనినో పెద్ద కుంభకోణంగా చూపిస్తున్నారు.***

వాస్తవానికి ఇది చిన్న లాజిక్. ఇక్కడ ప్రభుత్వం పసుపును కొనుగోలు చేసే డబ్బులిచ్చింది. సరుకు లేకుండా ఎవరికీ ఫ్రీగా డబ్బులివ్వలేదు. అంతవరకు నిధుల దుర్వినియోగం లేదు. కాకపోతే బి-గ్రేడ్ సరుకుకు ఏ-గ్రేడ్ ధర చెల్లించారనే విమర్శలున్నాయి. ఇక్కడ ఏ-గ్రేడ్ సరుకుకు, బి-గ్రేడ్ సరుకుకు తేడా క్వింటాలుకు 500 రూపాయలే! అయిదారువేల క్వింటాళ్లు ఆ విధంగా కొనున్నా ఆ తేడా నగదు దుర్వినియోగమైనట్లే! కాకపోతే ఇక్కడ లబ్ధిపొందింది పసుపు కొనుగోలుకు దళారుల అవతారమెత్తిన రాకీయ నాయకులైతే, యధాఫలంగా పండించిన పసుపుకు గిట్టుబాటు ధర రాక దళారులకు కొన్న ధరకే అమ్ముకుని నష్టపోయింది రైతులే! రాష్ట్ర ప్రభుత్వం దయతలచి పసుపుకు మద్దతుధర ప్రకటించినా అది నేరుగా రైతుకు చేరలేదు. ఎందుకంటే వేలం కేంద్రానికి దగ్గరలో వున్న రైతులు ట్రాక్టర్లలోనో, ఎద్దులబండ్ల మీదనో తాము పండించిన పసుపు బస్తాలను ఉదయగిరి కొనుగోలు కేంద్రంలో అమ్ముకోగలిగారు. అదే కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో రైతులు తమ వద్దవున్న పది క్వింటాళ్ళు, పాతిక క్వింటాళ్ల పసుపును అమ్ముకోవడానికి ప్రత్యేకంగా లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకోలేరు. ఇలా చేసుకోవాలంటే అదనంగా వచ్చే డబ్బు రవాణా ఛార్జీలకే సరిపోతుంది. కాబట్టి రైతులు ఈ తలనొప్పంతా మాకెందుకని క్వింటాకు రెండు వేలు తక్కువగానే దళారులకు అమ్మారు. దళారులు ఆయా గ్రామాలలో రైతుల వద్ద వున్న పసుపునంతా పోగేసి లారీలో పెట్టుకుని పసుపు కొనుగోలు కేంద్రానికి తరలించారు. స్థానికంగా వున్న రైతుల పాస్‌బుక్‌లు, పసుపు పండించినట్లుగా విఆర్ఓల నుండి ధృవీకరణ పత్రాలు పొంది ప్రభుత్వానికి అమ్మేసారు. ప్రతి పంటలోనూ జరిగేది ఇదే! వరి పండించిన రైతుకంటే, వేరుశెనగ పండించిన రైతుకంటే, కొబ్బరితోట రైతుకంటే... వాటిని కొనుగోలు చేసిన దళారికి వచ్చే ఆదాయం ఎక్కువ. అన్ని పంటల్లో మాదిరిగానే పసుపు అమ్మకాల్లోనూ దళారులు ప్రధానపాత్ర పోషించారు. కాకపోతే ఇక్కడ రాజకీయ నాయకులే దళారుల అవతారమెత్తడం విశేషం.

తమను దొంగలుగా చూస్తున్నారంటూ ఇప్పుడు ఉదయగిరి ప్రాంతానికి చెందిన నాయకులే తమ పార్టీవాళ్ల మీద తిరగబడుతున్నారు. మేం దొంగతనం చేసామా? దోపిడీలు చేసామా? భూకబ్జాలు చేసామా? లేని సరుకును ఉన్నట్లు చూపించి డబ్బులు తిన్నామా? రైతుల ఇష్ట ప్రకారమే పసుపును కొన్నాం, ఇక్కడ అమ్ముకున్నాం. సరుకు ఇచ్చేకదా మేం నాలుగు రూపాయలు సంపాదించుకున్నాం. ఈ మాత్రం వ్యాపారం చేసి మేం నాలుగు రూపాయలు సంపాదించుకోకపోతే, దీనికి కూడా పార్టీ అండగా నిలవకపోతే ఇక మేం ఈ పార్టీలో ఉండడం ఎందుకు? మీ వెనుక చేతులు కట్టుకుని తిరగడం ఎందుకు అని తమ పార్టీ జిల్లా నాయకులనే లాజిక్‌గా ప్రశ్నిస్తున్నారు.

మొన్న 23వ తేదీ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ముగిసాక కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇంట్లో తెలుగుదేశం జిల్లా నేతలందరూ సమావేశమయ్యారు. పసుపు విషయం ప్రస్థావనకు వచ్చినప్పుడు ఉదయగిరికి చెందిన నాయకులు, పసుపు అమ్మకాలతో సంబంధాలున్న వాళ్ళు... మేం పసుపుతో వ్యాపారం చేసుకుంటే తప్పేంటంటూ నిలదీసే సరికి జిల్లా పార్టీ నాయకులు కూడా వాళ్లకు ఏమీ సమాధానం చెప్పలేకపోయారు.

## సంక్షేమపథకాలను

# సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 24న వెంకటాచలం మండలంలోని డివిఎస్ కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న నగదును సద్వినియోగం చేసుకున్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సబ్సిడీ నగదును ఇతర అవసరాలకు



వెచ్చించడం తగదని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. ఎస్‌సి, ఎస్‌టి శాఖల ద్వారా కేవలం 48 పైసల వడ్డీకే ప్రభుత్వం 30 లక్షలు విలువజేసే ట్రక్కులు, 16 లక్షల విలువజేసే ఇన్నోవా కార్లు అందజేస్తోందని, యువత ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వేరుశనగ పంటకు 1680 కోట్ల రూపాయల మేర సబ్సిడీని ప్రభుత్వం అందజేసినట్లు ఆయన తెలిపారు. మొక్కలు నాటడం, చెట్లను సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణం కాపాడుకోవచ్చని, వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని పేర్కొన్నారు. ప్రతిచోటా పచ్చదనం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. భూ పరీక్షల ద్వారా పొలాల్లో ఎక్కడైనా సూక్ష్మపోషకాలు తక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే వాటి కొరతను అధిగమించడానికి జిప్సం, బోరాన్ వంటివాటిని ఉచితంగానే ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఎస్‌సి కార్పొరేషన్ ఇ.డి అంబేద్కర్, బిసి కార్పొరేషన్ ఇ.డి వెంకటస్వామి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కమలకుమారి, ఎల్‌డిఎం వెంకట్రావ్, ఎంఆర్ఓ సోమానాయక్, ఎంపిడిఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# 'కాపు' అభివృద్ధికి బాబే కాపలా!

## కాపు కార్పొరేషన్ ఛైర్మెన్ చలమలశెట్టి



కాపుల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని కాపు కార్పొరేషన్ ఛైర్మెన్ చలమలశెట్టి రామానుజయ వెల్లడించారు. ఈ నెల 24వ తేదీ నెల్లూరులోని భవాని ఇన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ ద్వారా గత సంవత్సరం 80వేల మందికి వివిధ పథకాల క్రింద ఆర్థిక సహాయం అందించినట్లు తెలియజేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా కాపులకు చెందిన 64వేల మంది యువతీ యువకులకు వివిధ పథకాల క్రింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. 6జిల్లాల్లో కాపు భవనాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. నెల్లూరుజిల్లాలో పొదలకూరు రోడ్డులో స్థలాన్ని గుర్తించడం జరిగిందని, భవన నిర్మాణానికి 5కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు కాపు కార్పొరేషన్ ద్వారా 2500 కోట్ల రూపాయలు వివిధ పథకాల క్రింద కాపులలో వున్న పేదలకు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. మంగళగిరిలో కారు లైసెన్సు వున్న కాపు యువకులకు కారులను ఇవ్వడం జరిగిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి కాపు యువతీ, యువకులకు 10లక్షల రూపాయల సబ్సిడీతో 25లక్షల రూపాయల రుణాలు ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మందికి అందించినట్లు తెలియజేశారు. గత సంవత్సరం సివిల్ సర్వీస్ పోటీ పరీక్షకు హాజరౌతున్న 500మంది యువతీ, యువకులకు శిక్షణా కార్యక్రమాలు ఇప్పించినట్లు ఈ సంవత్సరం 750 మందికి సివిల్ సర్వీస్ పోటీ పరీక్షల్లో శిక్షణనిచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అదేవిధంగా కాపు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయడంతో పాటు 25వేల మంది కాపు యువతీ, యువకులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఇ.డి వెంకటస్వామి, నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# బాలల హక్కుల పరిరక్షణకు కృషి

## - జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్అహ్మద్ మౌలానా



భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ బాలల హక్కులు-సంక్షేమ చట్టం-2015పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి మాట్లాడుతూ పోలీసులు, స్వచ్ఛంధ సంస్థలు, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటి సభ్యులు సమాజంలోని బాలల హక్కులను పరిరక్షించి వారిని సరైన మార్గంలో మంచిపౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆరు నెలలకొకసారి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్-2 వెంకట సుబ్బారెడ్డి, ఏఎస్పీ శరత్‌బాబు మాట్లాడుతూ 16ఏళ్లలోపు బాలలు నేరాలకు పాల్పడితే వారిని శిక్షించకుండా జువెనైల్‌హోంలో ఉంచి మంచి ప్రవర్తన వచ్చేలా ప్రయత్నించాలని సూచించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సుధ, న్యాయమూర్తులు లీలాశ్యామ్ సుందరి, వాసుదేవన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీరజ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి ప్రశాంతి, జువెనెల్ ఛైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, జిల్లా ప్రొహిబిషన్ అధికారి సంజీవరెడ్డి, పలు కోర్టుల న్యాయమూర్తులు, బార్ అధ్యక్షుడు ఫణిరత్నం పాల్గొన్నారు.

# బులియన్ మర్చంట్స్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ 2017-2020 నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నెల్లూరు రంగనాయకులపేటలోని ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో 24వతేదీ సోమవారం రాత్రి జరిగింది. అసోసియేషన్ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా అమరా మోహన్‌రావు, మట్టా ప్రసన్నాంజనేయులు, కోశాధికారిగా కొనగళ్ల శోభన్‌బాబు, ఉపాధ్యక్షులుగా ముల్లంగి రాధాకృష్ణయ్య, దగ్గుమాటి గోపీకృష్ణ, సహాయ కార్యదర్శులుగా మామిడి శ్రీనివాసులు, చక్కా లక్ష్మీనారాయణ, మరో 15మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ బులియన్ గోల్డ్, సిల్వర్, డైమండ్స్ మర్చంట్స్ అసోసియేషన్ చీఫ్ఆర్గనైజర్ శాంతిలాల్‌జైన్, వాసవీ సత్ర సముదాయాల (శ్రీశైలం) అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ముఖ్యఅతిథులు ఘనంగా సత్కరించారు.

# ఆధునిక కవితకు ప్రారంభకులు తిరుపతి వేంకటకవులు




ఆధునిక కవితకు ప్రారంభకులు తిరుపతి వేంకటకవులని, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వారు కవిత్వాన్ని రచించారని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్య అన్నారు. 23వ తేదీ నెల్లూరులోని టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో గాడ్‌ఫాదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీ పురస్కారాల కార్యక్రమానికి ఆచార్య వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ట్రస్టీ జి.లక్ష్మి మాట్లాడుతూ తెలుగు జంట కవులుగా పేరుపొందిన తిరుపతి వేంకట కవులు తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషకు చేసిన సేవలను ఇప్పటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా "తెలుగు భాష- పరిరక్షణ' అనే అంశంపై వివిధ కాలేజీలలో వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులందజేశారు. అనంతరం ఆచార్య వీరయ్యను ప్రముఖ కవయిత్రులు పాతూరి అన్నపూర్ణ, జి.సుభద్రాదేవి, గాలి లలిత, ప్రముఖ కవులు మోపూరు పెంచల నరశింహం, పోట్లూరు సుబ్రహ్మణ్యం, బొగ్గవరపు రాధాకృష్ణ మూర్తిలు సన్మానించారు. కార్యక్రమ నిర్వహణను సంస్థ డైరెక్టర్ మోహన్‌చంద్ర, జి.చక్రవర్తిలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలకు న్యాయనిర్ణేతగా ప్రముఖకవి మాటేటి రత్నప్రసాద్ వ్యవహరించారు.

# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నతనం నుంచి విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ చూపితే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు తెలివితేటలు పెరుగుతాయని గూడూరు ఆర్టీసి డిపోమేనేజర్ అనిల్ కుమార్ అన్నారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్, హరిశ్చంద్రారెడ్డి క్రికెట్ క్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆర్టీసి డిఎం అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత కీలకమో, అదేవిధంగా మానసికోల్లాసం కలుగజేసి శారీరక ధారుడ్యాన్ని పెంచే క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. సమాజంలో గౌరవం పెంచేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కాగా, గత అయిదురోజులుగా ఇక్కడ జరుగుతున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీల్లో వివేకానంద పాఠశాల విజయం సాధించింది. రన్నర్‌గా జడ్పీ బాలుర పాఠశాల నిలిచింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు జానకిరామిరెడ్డి, బాలకృష్ణంరాజు, నాగేశ్వరరావు, లవ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# వైజేపి లయన్స్ సేవలు అభినందనీయం

## ------- చంద్రశేఖరరెడ్డిని కొనియాడిన వక్తలు -------






గూడూరులోని వైజేపి లయన్స్ క్లబ్ (2016-17 సంవత్సరానికి) అధ్యక్షులుగా వరిదిరెడ్డి చంద్రశేఖరరెడ్డి చేసిన సేవలు ఎంతో అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. దాదాపు పాతిక లక్షల విలువైన పలు సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సోమవారం నాడు వారి కార్యాలయంలో అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, వైజేపి జన్మదినాన్ని పురస్కరించుకుని చిల్లకూరు మండలంలోని పాలిచెర్లవారిపాళెంలో ప్రజల సౌకర్యార్థం 14 సిమెంటుబెంచీలు, హైస్కూల్‌లో 28 బెంచీలు, గిరిజనకాలనీలో వయోవృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదే గ్రామంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయడం, కలువకొండలోని నరసింహస్వామి ఆలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం 12 సిమెంటుబెంచీలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గూడూరు టౌన్‌హాలులో పదిమంది వయోవృద్ధులకు ప్రతినెలా 15వ తేదీన ఫలసరుకులు అందజేస్తున్నామన్నారు. సరస్వతీ శిశుమందిర్‌లో డాక్టర్ సిఆర్‌రెడ్డి దాతృత్వంతో అక్కడ చదువుకునే విద్యార్థుల కోసం మొదటి అంతస్తులో రెండు భవనాల నిర్మాణాలను వైజేపి లయన్స్ సౌజన్యంతో పూర్తిచేయడం జరిగిందన్నారు. ఇందుకు సుమారు 15 లక్షల రూపాయల దాకా ఖర్చయిందన్నారు. సరస్వతి శిశుమందిర్ విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని, వారికి కంటిపరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశామన్నారు. ప్రతిభగల విద్యార్థులకు వెంకట్రామిరెడ్డి దాతృత్వంతో నగదు బహుమతులు 60వేలు అందజేశామని, తన సొంతనిధులు 5వేలతో పేద విద్యార్థులకు దుస్తులు అందజేశామన్నారు. చెన్నూరు స్పోర్ట్స్ వారి సహకారంతో కోర్టు ఆవరణంలో, మహాలక్ష్మమ్మ దేవాలయంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటుచేయడం జరిగిందని, చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశామని, డిఆర్‌డబ్ల్యు కళాశాల, చిల్లకూరు జడ్పీ పాఠశాల, పాలిచెర్లవారిపాళెం హైస్కూల్, రామన్న రాఘువాపురం పాఠశాలల్లో మొక్కలు నాటడం జరిగిందన్నారు. వైజేపి లయన్స్‌కు ఛైర్‌పర్సన్ దేవసేన, కనుమూరు హరిశ్చంద్రారెడ్డి, లయన్ మెంబర్ వెంకటేశ్వరరావు మరియు సభ్యులు సహాయ సహకారాలందించారని తెలిపారు. గూడూరులో వైజేపి లయన్స్ క్లబ్ తరఫున చేసిన వివిధ సేవలు అందించి లయన్స్ క్లబ్‌కు మంచి గుర్తింపు తెచ్చిన చంద్రశేఖరరెడ్డిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

# సబ్ పోస్ట్‌మాస్టర్ సేవలు.. భేష్



గూడూరు, దర్గావీధిలో వున్న సబ్ పోస్టాఫీసులో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న పర్వత వెంకటేశ్వర్లు ప్రజలకు అందజేస్తున్న సేవలు ప్రశంసాత్మకమని పలువురు కొనియాడారు. ఇక్కడ ప్రజలకు సేవింగ్స్‌బ్యాంకు, రికరింగ్ డిపాజిట్లు, సుకన్య సమృద్ధియోజన, ఆడపిల్లల కొరకు అకౌంట్స్ వగైరా పథకాలను బాగా అమలుచేస్తున్నారని, విధుల నిర్వహణలో క్రమశిక్షణతో ఉంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారని స్థానికులు ఆయన సేవలను అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా పర్వత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దర్గావీధిలో ఉన్న ఈ పోస్టాఫీసు ప్రజలకు బాగా ఉపయోగపడుతోందన్నారు. ఎవరైనా పైన పేర్కొన్న పథకాల తాలూకు కొత్తగా ఖాతాలు ప్రారంభించాలనుకుంటే పోస్టాఫీస్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



ఇటీవల గూడూరు ఆర్అండ్‌బి అతిథి భవనంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పాల్గొన్న ఛైర్‌పర్సన్ దేవసేన, కమిటీ సభ్యులు

గల్పిక

# ట్రంక్‌రోడ్డులో వెంకయ్య హాల్‌చల్!

ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, సీనియర్ నేత అద్వానీ, కేంద్రమంత్రులు వెంకయ్య నాయుడు, అనంతకుమార్, స్మృతి ఇరాని, నిర్మలా సీతారామన్, సురేష్ ప్రభు, అరుణ్‌జైట్లీ, సిద్ధార్ధనాథ్‌సింగ్, రాజ్యవర్ధన్ రాథోడ్, ఉమాభారతి తదితరులున్నారు. రాష్ట్రపతిగా ఉత్తరభారతదేశానికి చెందిన వ్యక్తిని ఎన్నుకున్నాం, కాబట్టి ఉపరాష్ట్రపతిగా దక్షిణ భారతదేశానికి చెందిన వ్యక్తిని నియమించాలని భావిస్తున్నాం. మీరేమంటారని అమిత్‌షా అందర్నీ ఉద్దేశించి అడిగాడు. అందుకు వెంటనే వెంకయ్యానాయుడు స్పందించి... ఒట్టి దక్షిణ భారతదేశంకు చెందిన వాడంటే కుదరదు... దేశంలోని అన్ని భాషలు వచ్చుండాలి. ముఖ్యంగా దక్షిణాది వస్త్రధారణ ఉట్టిపడేలా అడ్డపంచె కట్టేవాడై వుండాలి అని చెప్పాడు. దాంతో అమిత్‌షా, మోడీలతో పాటు అందరు కూడా... ఆ అర్హతలు నీకు కాక ఇంకెవరికి ఉన్నాయన్నట్లుగా వెంకయ్య వైపు చూడసాగారు. వాళ్ల చూపులతో వెంకయ్యకు గుండెల్లో రాయిపడ్డట్లయ్యింది. అనవసరంగా నోరు జారి ఇరుక్కున్నానే అని మనసులో అనుకుంటూ... నావైపేంటి అలా చూస్తున్నారు. నేను మోడీని రెండోసారి కూడా ప్రధానిగా చూడాలనుకుంటున్నాను. కాబట్టి నేను ఆయనను వదిలిపోయే ప్రసక్తే లేదు. కావాలంటే దక్షిణాది నుండి నేనే కొన్ని పేర్లు చెబుతాను అని చెప్పి విద్యాసాగర్‌రావు, సదాశివం, ఒ.రాజగోపాల్... ఇంకా కొన్ని పేర్లు చెప్పాడు. అమిత్‌షా వుండి... రాజ్యసభ కంట్రోల్ చేయాలన్నా, ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తేవాలన్నా నువ్వే కరెక్ట్. కాబట్టి మీరొప్పుకోవాల్సిందే అని పట్టుబట్టాడు. సముద్రంలో వున్న చేపను మీరు వాటర్ బౌల్‌లో పెట్టాలనుకుంటున్నారు... నాకు నోరు, కాలు ఆడనిదే బాగుండదు, ఆరోగ్యం కూడా సరిగా వుండదు. నన్ను వదిలేసి ఇందాక పదిమంది పేర్లు చెప్పాను కదా వారిలో ఒకరిని సెలెక్ట్ చేయొచ్చు కదా అని వెంకయ్య కోరాడు. అప్పుడు మోడీ జోక్యం చేసుకుని... దీనికి పేచీ ఎందుకు, మీరు ప్రతిపాదించిన పదిమంది పేర్లతో పాటు మీ పేరును కూడా చీటీ వ్రాసి లాటరీ తీస్తాం. లక్కీడిప్ ద్వారా ఎవరి పేరు వస్తే వాళ్లే ఉపరాష్ట్రపతి అభ్యర్థి అని చెప్పాడు. గుడ్డిలో మెల్ల... ఇదే నయం. పదకొండు మందిలో ఒకడిని... నా పేరు వచ్చేదానికి పది శాతమే అవకాశం ఉంటుందనుకుని వెంకయ్య సరేనన్నాడు. అమిత్‌షా చెప్పిన పేర్లను వ్రాసి స్మృతిఇరానీ ఓ డబ్బాలో వేసింది. ఇందులో ఓ చీటీ తీయమని సుష్మాస్వరాజ్‌కు చెప్పారు. ఆమె అందులో నుండి ఓ చీటీ తీసి నరేంద్ర మోడీ చేతిలో పెట్టింది. ఆయన దానిని విప్పి పేరు ప్రకటించాడు... యం.వెంకయ్యానాయుడుజీ అని. తన పేరు వినగానే వెంకయ్య షాక్‌కు గురయ్యాడు. తల్లి తన చేతిని బలవంతంగా విదిలించుకున్నంత ఫీలింగ్‌కు గురయ్యాడు. ఆయన దిగ్భ్రాంతిలో ఉండగానే మిగతావాళ్లు ఎవరిపాటికి వాళ్లు వెంకయ్యకు విషెష్ చెప్పి వెళ్లిపోయారు. వెంకయ్య ఒక్కడే మిగిలాడు. కొద్దిసేపటికి తేరుకుని, నా పేరే ఎలా వచ్చిందబ్బా అని ఆలోచిస్తూ అక్కడే డబ్బాలో వున్న మిగతా చీటీలను తెరిచి చూసాడు. అంతే ఆయన కళ్లు బైర్లు కమ్మాయి. అన్ని చీటీల మీద వెంకయ్యానాయుడు పేరే వ్రాసుంది. అమ్మనా... అమిత్‌షా. స్మృతిఇరానీ, నువ్వు కలిసి ఇలా నన్ను ఇరికించారా అని అనుకున్నాడు. కాని జరగాల్సింది జరిగిపోవడంతో ఇంకేమీ చేయలేక నేరుగా ప్రధాని ఇంటికి వెళ్లాడు. సార్, ఉపరాష్ట్రపతి ఎన్నికల లోపే ఒక్కసారి నేను మా ఊరుదాకా వెళ్లొస్తానని అడిగాడు. అందుకు మోడీ సరేనన్నాడు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధి గాంచిన నెల్లూరు నగరం. రైల్వేస్టేషన్‌లో అప్పుడే జి.టి ఎక్స్‌ప్రెస్ ఆగింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు చాలామంది ఫస్ట్‌క్లాస్ ఏసి బోగి వద్ద దండలు పట్టుకుని నిలబడి వెంకయ్య నాయుడు కోసం చూస్తున్నారు. కాని, వెంకయ్య మాత్రం దానిపక్కనే వున్న జనరల్ బోగీలో నుండి దిగాడు. అది చూసి బీజేపీ నాయకులు షాకయ్యారు. ఏం సార్, జనరల్ బోగీలో దిగారు అని కర్నాటి ఆంజనేయరెడ్డి అడిగాడు. అందుకాయన... ఇక ఐదేళ్లు యుద్ధ విమానాలు, ఆర్మీ హెలికాప్టర్లు ఎక్కుతుండాలి కదా... వాటిలో పోతే రైలు జనరల్ బోగీలో వెళ్లిన ఫీలింగ్ ఎక్కడ వస్తుంది అని, ఇంతకీ మీరంతా ఎవరని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నతో అందరూ అవాక్కయ్యారు. కొద్దిసేపటికి తేరుకుని... సార్, మేము బీజేపీ కార్యకర్తలం. మీ శిష్యులం అని చెప్పారు. బీజేపీ వాళ్లయితే పోయి మీ పార్టీ జెండాలు కట్టుకోండి... నా వద్దకు ఎందుకు వచ్చారు... నాకు ఏ పార్టీ జెండా లేదు. ఎవరి అజెండా లేదు... పోండి... పోండి... అని తరిమేసాడు. తర్వాత ఆయనొక్కడే బయటకొచ్చి, ట్రంకురోడ్డుకు ఒక ఆటోను 50రూపాయలకు బేరమాడి మాట్లాడుకున్నాడు. ఆటో ఎక్కి సీమా సెంటర్‌లో దిగాడు. ఆ సెంటర్‌లో వున్న వేపచెట్టును తనివితీరా చూసాడు. కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగుతుండగా చెట్టును గాఢంగా కౌగిలించుకున్నాడు. అప్పుడు విద్యార్థిగా వున్నప్పటి సంఘటనలన్నీ ఆయన కళ్లముందు స్క్రీన్ కట్టినట్లు కనిపించాయి. పాత జ్ఞాపకాల చిత్రాలు పూర్తయ్యాక ఆయన సీమా కేఫ్‌లో ఓ టీ తాగాడు. తర్వాత విఆర్‌సి దాకా వెళ్లాడు. కాలేజీని చూసాడు. అక్కడనుండి 'జైహింద్ స్వీట్స్'కు వచ్చాడు. అక్కడ నాలుగు మలైకాజాలు, పావుకిలో మిక్చర్ తిన్నాడు. అక్కడ నుండి కోమల విలాస్‌కు వెళ్లాడు. కడుపునిండా భోజనం చేసాడు. తర్వాత ఒక ఆటోను మూడుగంటలపాటు అద్దెకు మాట్లాడుకుని... నెల్లూరు నగరంలోని రోడ్లన్నీ తిరగసాగాడు. అలా శెట్టిగుంటరోడ్డులోకి వెళ్లినప్పుడు సలసల కాగుతున్న నూనెలో వేస్తున్న బోండాలను చూసి ఆయన మనసు లాగేసింది. ఆటోను ఆ టిఫిన్ కొట్టు వద్ద ఆపి పది బోండాలు శెనగల చట్నీ, కారప్పొడి వేసుకుని తిన్నాడు. తర్వాత వినాయక సినిమాహాల్‌లో 'బాలనాగమ్మ' సినిమా ఫస్ట్‌షో చూసి, రిత్విక్‌ఎన్‌క్లేవ్‌లోని ఇంటికి చేరుకున్నాడు. బెడ్‌రూంలోకి వెళ్లి స్నానం చేసి బెడ్‌మీద వాలిపోయాడు.

సరిగ్గా అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతం... వెంకయ్య సతీమణి ఉషమ్మకు లీలగా ఏదో మాటలు వినిపించడంతో కళ్లు తెరచి పక్కకు చూసింది... డేరింగ్... డాషింగ్... క్యాలిబర్, కెపాసిటీ, డైవర్శిటీ... క్రికెట్‌లో నాటౌట్... అసెంబ్లీలో వాకౌట్... బ్యాంకుల్లో అప్పు... కట్టకుంటే నిప్పు... ఉప్పు, చెప్పు, తప్పు, కాఫీ కప్పు... ఈ ప్రభుత్వంలో అన్నీ అప్పులే... ఎయిర్ కనెక్టివిటి, వాటర్ కనెక్టివిటి, రోడ్ కనెక్టివిటి... ఒకప్పుడు జైళ్లలో సెల్‌లు ఉండేవి... ఇప్పుడు అందరి చేతుల్లోనూ సెల్‌లు వుంటున్నాయి... ఇదీ మోడీ మహిమ... వెంకయ్యనాయుడు చేతులను గాల్లో తిప్పుతూ నిద్రలోనే ప్రాసలను మాట్లాడేస్తున్నాడు. అదంతా చూసిన ఉషమ్మ... కళ్ల నిండా నీళ్లు పెట్టుకుని... ఎలాంటి మనిషికి ఎలాంటి కష్టం వచ్చింది... పగవాడికి కూడా ఇలాంటి బాధ వద్దురా దేవుడా... వసపిట్ట చేత ఎవరన్నా మౌనవ్రతం చేయిస్తారా... నోరు విప్పకుండా ఈయన ఎన్నిరోజులుండగలడో... అని శంకిస్తూ బాధపడసాగింది.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ నిర్వహణలో అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. బిడ్డల విద్యా వివాహ విషయాలలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి. వస్తువులు, డబ్బు భద్రపరచుకొనడం చేయండి. ఆర్థికంగా బాగుండినా స్థిమితంగా ఉండలేరు. కుటుంబ విషయాలపై దృష్టిపెడతారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. బంధుమిత్రులను కలుసుకుంటారు. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. దూర ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. గిట్టనివారి వల్ల మాటలు పడవలసి ఉంటుంది. ఇంట బయట పనులందు శ్రమ వుంటుంది. కాని చేపట్టిన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

యజమానులకు వర్కర్ల వల్ల ఇబ్బందులుండును. ఉద్యోగులకు అధికారుల అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాల ప్రయత్నాలు జరుగుతాయి. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అయినా అవసరాలకు కొద్ది ఋణాలు చేయక తప్పదు. అనుకున్న పనులను సాధిస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ప్రయాణాలుంటాయి. కమిటీ సమావేశాలలో ప్రముఖ పాత్ర వహిస్తారు. ఉన్నత విద్యావకాశాలుంటాయి. ఇతరులకు ధన వస్తు మాట రూపంలో సహాయం చేస్తారు. క్రొత్త వ్యాపారాలకు, సంస్థలలో పెట్టుబడులకు అవకాశములు దొరుకుతాయి. పట్టుదలతో అనుకున్న పనులు జరుపుకుంటారు. సోదరవర్గానికి మంచి జరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్యాలలో పాల్గొంటారు. సాంకేతిక న్యాయ వైద్య రంగాల వారికి ఆర్థికావకాశాలు బాగుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు పొందుతారు. ఒకటి రెండు పెద్ద అనవసర ఖర్చులుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ముఖ్య విషయాలపై నిర్ణయాలు తీసికొనలేక టెన్షన్ పడతారు. పెండింగ్ సమస్యలు పరిష్కారం కాగలవు. ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. వ్యాపారాలు, అధికారులకు ప్రభుత్వ సంబంధమైన ఇబ్బందులు కలుగవచ్చు. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగములలో కాని, ఇతర కార్యక్రమములలోగాని నిర్వహణ సామర్థ్యము బాగుంటుంది. చేతి డబ్బులు ఇతరుల పనులకుగాను ఖర్చు పెట్టవలసి రావచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్య ఆదాయాన్నిస్తాయి. ఆత్మీయులను కలుస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 28.7.2017 నుండి
తేది. 3.8.2017 వరకు

ఈ వారం మిధునంలో శుక్రుడు, కర్కాటకంలో రవికుజులు, సింహంలో బుధ రాహువులు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, కుంభంలో కేతువు, కన్య తుల వృశ్చిక రాశులలో శుక్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 4 శుక్రవారము వరలక్ష్మీవ్రతము

### ముహూర్తములు

తేది 30 ఆదివారం ఉదయం గంట 9.0 నుండి 11.0లోగా వివాహ, గృహారంభ, వ్యాపారాలు కన్యాలగ్నము.

తేది 2 బుధవారము ఉదయం గంట 9.0 నుండి 11.0 లోగా వివాహ, గృహారంభ, వ్యాపార, కేశఖండనలకు కన్యాలగ్నము.

### శ్రావణ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | పంచమి | ఉ॥ గం.9.33వ॥ |
| తేది. 29 | శని | షష్ఠి | ఉ॥ గం.9.35వ॥ |
| తేది. 30 | ఆది | సప్తమి | ఉ॥ గం.10.10వ॥ |
| తేది. 31 | సోమ | అష్టమి | ఉ॥ గం.11.12వ॥ |
| తేది. 1 | మంగళ | నవమి | ప॥ గం. 12.40వ॥ |
| తేది. 2 | బుధ | దశమి | ప॥ గం.2.27వ॥ |
| తేది. 3 | గురు | ఏకాదశి | సా॥ గం.4.26వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

హామీలు, మధ్యవర్తిత్వాలకు పోవద్దు. పిల్లల వల్ల ఖర్చులు ఉంటాయి. ఇబ్బందులుండినా ధైర్యంగానే ఉంటారు. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగిపోతుంది. దైవ కార్యాలలో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులుండవచ్చును. ఖర్చులు అధికంగా ఉంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. వాహనాలు నడిపేవారు, కరెంటు పనుల వారు జాగ్రత్తగా ఉండాలి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం సంతృప్తికరం. అధికారులకు స్థానమార్పు, పెండింగ్ పనులు పరిష్కారం కాకపోవుట, ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అవసరాలకు డబ్బు సమకూర్చుకుంటారు. వృత్తి వ్యాపారాలలో కొత్త విస్తరణ ప్రయత్నాలు జరగకపోయినా, ఆదాయ లోపం ఉండదు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉన్నత విద్యపై అనిశ్చితి ఉంటుంది. నిరుద్యోగులకు అవకాశాలు దొరకడం, దైవ సేవా కార్యములలో పాల్గొనడం, సహాయం చేయడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. విలువైన వస్తువులను సమకూర్చుకొంటారు. ఆర్థిక ఒప్పందాలు జరుగును. వృత్తి జీవనం కలవారికి మంచి అవకాశాలు దొరకడం, వ్యాపార వర్గాలకు ఆదాయం బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకొంటారు. ఉద్యోగులకు అధికారుల నుండి అనుకూలత, అధికారులకు స్థానమార్పులుండును. రాజకీయ వర్గాలు సామరస్యంగా పోవడం మంచిది. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. వ్యాపారాలు లాభసాటిగా జరుగుతాయి. కొత్త పెట్టుబడులకు కొత్త వ్యాపారాలకు అవకాశాలుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

విలువైన వస్తువులు సమకూరుతాయి. దైవ సేవ, సామాజిక రంగాలకు సహాయం చేయడం చేస్తారు. స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి. పనులు సానుకూలంగా జరిగినా టెన్షన్ ఉంటుంది. మీ ఆరోగ్యం ఫరవాలేదు. ఆర్థికావకాశాలు కలసివస్తాయి. అయితే కొంత డబ్బు ఖర్చుపెట్టవలసి వస్తుంది. బిడ్డలకు విద్యా ఉద్యోగ విషయాలలో అనుకూలత ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శుభకార్యాల తేదీలను నిర్ణయం చేస్తారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. పొదుపు పెట్టుబడి విషయాలను ఆలోచిస్తారు. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి. ఆర్థికంగా బలపడి వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది.

# సాహోరే... 'తెలుగు వైభవం'

- డల్లాస్‌లో మెరిసిన తెలుగు వెలుగులు
- అందరినీ ఆకట్టుకున్న 'టాంటెక్స్' కార్యక్రమాలు



ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం(టాంటెక్స్) వారి ఆధ్వర్యంలో 'తెలుగు వైభవం' కార్యక్రమం మరియు ఆ సంస్థ ప్రత్యేక కార్యక్రమం 'నెలనెలా తెలుగు వెన్నెల' తెలుగు సాహిత్యవేదిక 10వ వార్షికోత్సవాన్ని ఇటీవల డల్లాస్‌లోని ఇర్వింగ్ హైస్కూల్ ఆడిటో రియంలో అధికసంఖ్యలో పాల్గొన్న డల్లాస్ ప్రాంతీయ తెలుగు భాషాభిమానుల మధ్య ఎంతో వైభవంగా నిర్వహించారు. ప్రవాసంలో దాదాపు 120నెలల పాటు నిరాటం కంగా అనేకమంది సాహితీవేత్తల నడుమ సాహిత్యసదస్సులు నిర్వహించి ఈ సంస్థ తన ప్రత్యేకతను చాటుకుంది. తొలుత సాహిత్యవేదిక సమన్వయకర్త సింగిరెడ్డి శారద 2017వ సంవత్సరంలో నిర్వహిస్తున్న సాహిత్యకార్యక్రమాలను వివరించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వి.దుర్గాభవాని సాహిత్యం విశిష్టత గురించి ఉపన్యసించారు. ప్రముఖ విమర్శకుడు కథ, యాత్రా రచయిత దాసరి అమరేంద్ర 'తెలుగు యాత్రా సాహిత్యం' అనే అంశంపై చక్కగా ప్రసంగించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. కాత్యాయని విద్మహే 'తెలుగు సాహిత్య విమర్శ' అనే అంశంపై ప్రధాన ప్రసంగం చేయగా, సంపాదకులు వాసిరెడ్డి నవీన్ 'తెలుగు కథ-మారుతున్న స్వరం' అనే అంశంపై ప్రసంగించారు. నాటక రచయిత కందిమళ్ళ సాంబశివరావు తెలుగు నాటకం విశిష్టతను వివరించారు. ప్రముఖ కథా రచయిత గొర్తి బ్రహ్మానందం తెలుగు సాహిత్యంపై తెలుగు భాషా సాహితీవేత్తలతో చర్చ నిర్వహించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను చర్చించారు.

**కవితల పోటీలో విజేతలకు బహుమతులు :**

ఈ 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫోటో కవితల పోటీకి విశేష ఆదరణ లభించింది. ప్రముఖ కవయిత్రి మెర్సీ మార్గరెట్ ఫోటో కవితల పోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. డల్లాస్‌కి చెందిన నశీంషేక్ రాసిన 'పునాదులు-సమాధులు' కవితకి ప్రథమ బహుమతి లభించగా, రావుల పురుషోత్తమరావు రచించిన 'ఆదరాబాదరాగా' కవితకి ద్వితీయ బహుమతి లభించింది. చిలుకూరి వెంకటశాస్త్రి రచించిన 'జయహో' కవితకి తృతీయ బహుమతి లభించింది.




**అలరించిన 'జయహో శ్రీకృష్ణదేవరాయ' కూచిపూడి నృత్యరూపకం :**

దాదాపు మూడు దశాబ్దాలకు పైగా తన జీవితాన్ని కూచిపూడి కళకే అంకితం చేసి విశేష ఖ్యాతి సముపార్జించిన ప్రఖ్యాత నాట్యాచార్యులు, చలనచిత్ర నృత్యదర్శకులు కె.వి సత్యనారాయణ ఈ సందర్భంగా డల్లాస్‌కి చెందిన నాట్య కళాకారులతో కలసి "జయహో శ్రీకృష్ణదేవరాయ' కూచిపూడి నృత్యరూపకాన్ని ఆద్యంతం అధ్భుతంగా ప్రదర్శించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. అష్టదిగ్గజాలుగా పాల్గొన్న డల్లాస్ తెలుగు భాషాభిమానుల వేషధారణ ఈ రూపకానికి ప్రత్యేక శోభను చేకూర్చింది. అనంతరం ప్రత్యేక సదస్సు సమన్వయకర్త మహేష్ ఆదిత్య ఆదిభట్ల స్వాగత వచనాలతో వినోద కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం(టాంటెక్స్) అధ్యక్షులు ఉప్పలపాటి కృష్ణ మాట్లాడుతూ, 31 సంవత్సరాల టాంటెక్స్ తెలుగువైభవాన్ని మనమంతా కలసి ఆనందంగా జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఒక చిన్న సంస్థగా మొదలైన ఈ టాంటెక్స్ ఇప్పుడు అమెరికాలో ఉన్న జాతీయ తెలుగు సంస్థలతో ధీటుగా గుర్తింపుతెచ్చుకోవడం ఎంతో విశేషమన్నారు. ఈ కార్యక్రమానికి తనవంతు ఆర్థిక సాయం చేస్తూ, ఇక్కడికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రవాసభారతీయుల ఐటి ప్రత్యేక ప్రతినిధి మనోహర్‌రెడ్డిని టాంటెక్స్ కార్యవర్గ బృందం ఘనంగా సత్కరించింది. అనంతరం స్పాన్సర్స్ నాట్స్ సంస్థను, లోన్‌స్టార్ స్పాన్సర్స్ డా.పైల మల్లారెడ్డి, డా. ప్రేమ్‌రెడ్డిలను, నాటా-టిపిఏడి సంస్థలను, ప్రీమియం స్పాన్సర్స్ తానా సంస్థను, క్వాంట్ సిస్టమ్‌ను, గోల్డ్ స్పాన్సర్ రాం కోనార, సౌత్‌ఫోర్క్ డెంటల్‌లను సభావేదిక మీద ఘనంగా సన్మానించారు.

**ఆకట్టుకున్న సంగీత విభావరి :**

ఈ సందర్భంగా ప్రముఖ గాయని సునీత ఆధ్వర్యంలో, సంగీత దర్శకుడు-గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, గాయకులు భార్గవి పిళ్ళై, దినకర్, యాసిన్ నజీర్, సమీర భరద్వాజ్‌లు నిర్వహించిన సంగీత విభావరి, ఆ తర్వాత 1986 నుంచి (ఈ సంస్థ ప్రారంభమైన సంవత్సరం) 2017 దాకా ఆయా సంవత్సరాల్లో అత్యుత్తమ పాటలుగా గుర్తింపబడిన పాటల సమాహారాన్ని, తమ నృత్యనైపుణ్యాన్ని జోడించి 'టాంటెక్స్ చిత్రలహరి' పేరుతో నిర్వహించిన వినూత్న కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

# ఆ రెండు కాలువల అభివృద్ధికి 'జైకా' నిధులు

**- బీద మస్తాన్‌రావు**

కావలి నియోజకవర్గంలోని దగదర్తి-రాచర్లపాడు, దగదర్తి-ముంగమూరు కాలువలను జైకా నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతోందని రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు వెల్లడించారు. ఈ నెల 22న ఆయన నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అభివృద్ధి ప్రాజెక్ట్ ఫేస్-2, అంతర రాష్ట్ర జలవనరుల పంపిణీపై జైకా నిధులను సమకూర్చేందుకు జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ కాలువల స్థితిగతులను పరిశీలించేందుకు వచ్చిన కమాండెడ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ కమిషనర్ డా.పిఎస్ రాఘవయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కాలువల అభివృద్ధికి నిధులు వెచ్చించేందుకు గతంలో జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటింగ్ ఏజెన్సీ (జైకా) సూత్రప్రాయంగా అంగీకరించివుందన్నారు. ఆ రిపోర్ట్‌పై ఇతర రాష్ట్రాల వారు అభ్యంతర వ్యక్తం చేసిన నేపథ్యంలో, వాటిని పరిశీలించేందుకు వచ్చిన నిపుణుల కమిటీకి, జపాన్ నుంచి వచ్చిన విదేశీ నిపుణులతోనూ ఆయన చర్చించి ఆ కాలువల ఆవశ్యకతను వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన అధికారులు రైతుల ప్రయోజనాలను కాపాడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ రెండు కాలువలను జైకా నిధులతో అభివృద్ధి చేసేందుకు అంచనాలు తయారుచేసి జిల్లా అధికారులు వారికి తెలియజేశారని,



**కావలి కబుర్లు**

ఈ రెండు కాలువల పరిధిలోని రైతులకు ఇది సువర్ణావకాశం కాగలదని బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితర అధికారులు పాల్గొని వారి నివేదికను అందజేశారు.

# 30 ఏళ్ళుగా రహదారి లేదు

**- కందులవారిపాలెం దళితవాడ ప్రజల ఆవేదన**



కలిగిరి మండలంలోని కందులవారి పాళెం దళితవాడకు గత 30ఏళ్ళుగా రహదారి లేదని, దీంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి, సమాజ న్యాయ ప్రచారసమితి ప్రతినిధి టి. కృష్ణ మరికొందరు దళితులు కలసి కావలి ఆర్డీఓకు ఒక వినతిపత్రం సమర్పించుకున్నారు. తమ గ్రామం దళితవాడకు 5వందల మీటర్ల దూరంలో ఉందని, గ్రామం నుండి దళితవాడకు రహదారి లేనందువల్ల పిల్లలు బడికి పోవాలంటే పొలాల గట్లమీదనే నడుస్తూ పలు ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. గత పాతికేళ్ళ నుంచి ఈ దళితవాడకు దారి కల్పించాలని జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక అధికారులకు అనేకసార్లు విజ్ఞాపనలు సమర్పించుకుంటూనే ఉన్నామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 46 సెంట్ల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని రైతులకు నష్టపరిహారం చెల్లించివుంటే ఇప్పుడు 40 కుటుంబాల వారు ఇలా అవస్థలు పడేవారు కాదని వారు పేర్కొన్నారు. దళితులకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వాలు ఈ దుస్థితిని పట్టించుకోకపోవడం దారుణమని వారు వాపోయారు. 30 ఏళ్ళుగా దారి లేకున్నా తమ గోడు ఎవరూ విన్పించుకోకపోవడం తమకు తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. దారి లేకపోవడంతో వాహన సదుపాయంలేదని, పిల్లలు పెద్దలు నిత్యం కనీసం కిలోమీటరు దూరం నడుచుకుంటూ చుట్టూ తిరిగి వెళ్ళాల్సిందే తప్ప మరో గత్యంతరం లేని పరిస్థితి తమకు దాపురించిందని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారి సౌకర్యాన్ని కల్పించాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# బాలబాలికలకు యూనిఫాంలు



కావలిలోని డా.సిఎల్ఎన్ రెడ్డి, సుజనమ్మ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 21న కావలిలోని మునిసిపల్ హైస్కూల్స్, జడ్పీ హైస్కూల్స్‌కు సంబంధించిన, ఆర్థికంగా వెనుకబడిన బాలబాలికలకు యూనిఫాం రెండు జతలు, నోట్‌బుక్స్, డిక్షనరీ, పెన్ సెట్స్ పంపిణీచేశారు. అంతేకాదు 21మంది పేద బాలబాలికలకు స్కూల్ ఫీజు, పరీక్షల ఫీజును కూడా అందజేసి తమ వితరణను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి హెడ్మాస్టర్ ఏ. కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, రోటరీక్లబ్ ప్రెసిడెంట్ ఏ.శ్రీనివాసరావు, ప్రముఖులు రాజారెడ్డి, కొండారెడ్డి, కొండలరావు, ఆయా స్కూళ్ళ హెడ్మాస్టర్లు సుబ్బారావు, రమణారెడ్డి, ట్రస్ట్ ఆర్గనైజర్ అనుమలశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.లక్ష్మీనరసారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు తాము అండదండలందిస్తామని పేర్కొన్నారు.



# 'మలిశెట్టి'కి కాళిదాస సత్కారం

కావలి ఏఎంసి ఛైర్మెన్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన మలిశెట్టి వెంకటేశ్వర్లును ఇటీవల కావలిలోని కాళిదాస కళారాధన సమితి కమిటీ సభ్యులు దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సమితి ప్రధాన కార్యదర్శి జె.నాగేశ్వరరావు మాట్లాడుతూ, తన శిష్యుడైన మలిశెట్టి భవిష్యత్తులో మరిన్ని గొప్ప పదవులను అందుకోవాలని ఆశీర్వదించారు. కోశాధికారి కోట రమేష్ మాట్లాడుతూ, మలిశెట్టి పదేళ్ళ పాటు కావలి పట్టణ టిడిపి అధ్యక్షునిగా ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు అమరా యాదగిరి, పిఆర్ఓ సలీంబేగ్, టిడిపి యువసేన నాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 'మంచికంటి'కి సన్మానం



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయ పాలకమండలి ఛైర్మన్ మంచికంటి సుధాకరరావును ఈ నెల 23వ తేది ఉదయం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశంలో సత్కరించారు. అదేవిధంగా పాండురంగ అన్నదాన సమాజం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు తదితరులను కూడా ఘనంగా సన్మానించారు. ఆయా రంగాల్లో వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా తమ అసోసియే షన్ తరపున వారికి ఈ సన్మానాలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసి యేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల శేషయ్యగుప్తా, గుండ్లపల్లి శ్రీధర్‌రావు, కోశాధికారి అచ్యుత సుబ్రహ్మణ్యం, సభ్యులు నరసింహం, చేబోలు నారాయణ పాల్గొన్నారు.

# బెట్టింగ్ బెండు తీస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

కలిగిస్తున్నాడు. ఆయన ఎస్పీగా వచ్చీ రాగానే అవినీతి, అక్రమాల మకిలి అంటిన తన శాఖను సంస్కరించుకోవడంతో పాటు ఎర్ర చందనం, ఇసుక అక్రమ రవాణా, బెట్టింగ్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాడు. ముందుగా బెట్టింగ్ బంగార్రాజుల భరతం పట్టడం మొదలుపెట్టాడు. బెట్టింగ్స్ పాపానికి ఇటీవల నెల్లూరుకు చెందిన ఓ కుటుంబం తమిళనాడులో ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే! జిల్లా నలుమూలలా వేళ్లునుకుని వున్న బెట్టింగ్ వటవృక్షాన్ని కూలదోయడానికి ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ కంకణం కట్టుకున్నారు. జిల్లాలోనే బెట్టింగ్ కింగ్‌గా పేరుగాంచి, ప్రతిరోజూ కోట్ల రూపా యలలో జూదం ఆడిస్తున్న కృష్ణసింగ్‌ను పట్టుకుని తమదైన శైలిలో విచారించారు. కృష్ణసింగ్ నోరు విప్పడంతో బెట్టింగ్ అన్నది చిన్న జూదం కాదని, హైదరాబాద్ డ్రగ్స్ మాఫియా లాగే దీని వెనుకా చాంతాడంత జాబితా వుందన్నది అర్థమైపోయింది. జిల్లాలో బెట్టింగ్స్ మాఫియాకు, పోలీసు శాఖతో ఉన్న సంబంధాలు బట్టబయలయ్యాయి. కృష్ణసింగ్ నోట వచ్చిన వివరాల దెబ్బకు ఎస్పీయే షాక్ అయ్యారు. ఎందుకంటే కొందరు పోలీసు అధికారులు డబ్బుల కోసం ఖాకీ బట్టలకున్న గౌరవాన్ని ఎంతగా తాకట్టుపెట్టా రన్న విషయం కృష్ణసింగ్ విచారణలో బయటకొచ్చింది. జిల్లాలో ఎవరెవరు బెట్టింగ్స్ నిర్వహిస్తున్నారు? బెట్టింగ్స్‌ను సాఫీగా నిర్వ హించడానికి పోలీసు శాఖలో ఎవరెవరికి ఎంతెంత మామూలు పోతుంది? బెట్టింగ్స్‌కు ఫండ్‌రైజర్స్ ఎవరెవరు? అనే విషయాలన్నీ కూడా విచారణలో వెలుగు చూసాయి. ఈ బెట్టింగ్స్ ముఠాకు అండగా వుంటున్న అధికారపార్టీ నాయకుడెవరు? అన్న విషయం కూడా బయటపడింది. పోలీసుల విచారణలో కృష్ణసింగ్ పలువురు బుకీల పేర్లను వెల్లడించారు. దీంతో వారిలో కొందరిని పోలీ సులు అదుపులోకి తీసుకుని విచారించారు. బుకీలందరూ ఒకే మాట చెప్పారు. సార్, గతంలోగాని, ఇప్పుడుగాని బెట్టింగ్స్ నిర్వహించిన మాట వాస్తవమే! ఇక నుండి బెట్టింగ్స్‌కు దూరంగా ఉండి బుద్ధిగా బ్రతుకుతాము. మీరు దయతలచి నెల్లూరులో ఉండమంటే ఉంటాం, లేదంటే ఊరొదిలి పోతాం అని విన్నవించు కున్నట్లు తెలుస్తోంది.

## పోలీసు పరువు తీసారు...

బెట్టింగ్స్‌ను అరికట్టాల్సిన పోలీసులే బెట్టింగ్‌రాయుళ్లకు అండగా నిలిచారు. వారిచ్చిన మామూళ్లు అందుకున్నారు. వారికి పూర్తి సహాయసహకారాలు అందించారు. డిఎస్పీ స్థాయి అధికారికే 80లక్షలు ఇచ్చినట్లు బెట్టింగ్ కింగ్ చెప్పినట్లు సమాచారం. ఇక సిఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందికి... ఎవరి వాటాలు వాళ్లకు అంది వుంటాయనడంలో సందేహం లేదు. బెట్టింగ్ ముఠాకు గత ఎస్పీ కూడా పూర్తిస్థాయిలో సహకరించాడని తెలుస్తోంది. బెట్టింగ్‌రాయుళ్ల విచారణలో తమ శాఖ అధికారుల పాత్రే ఎక్కు వుగా బయటపడడంతో ఆగ్రహించిన ఎస్పీ రామకృష్ణ కానిస్టేబుల్ నుండి డిఎస్పీల వరకు బెట్టింగ్స్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ మెమోలు జారీ చేశారు.

## నేతలే పాత్రధారులు...

నెల్లూరులో బెట్టింగ్ రాయుళ్లకు ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మంత్రి నారాయణ ప్రధాన అనుచరుడు సహకారం దండిగానే వున్నట్లు తెలిసింది. జిల్లాలోని బుకీలందరూ కలిసి కోటి రూపాయలకు పైనే ఈయనకు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. బెట్టింగ్స్ నిర్వహణకు ఎవరూ అడ్డుపడకుండా పైస్థాయిలో అంతా నేను చూసుకుంటానని ఆయన గ్యారంటీ ఇవ్వడంతో ఈ కాసుల మూట ఇచ్చారు. ఇతనే గతంలో ముత్తుకూరు రోడ్డులో పేకాటక్లబ్‌ను కూడా పెట్టాడని, అప్పుడు ఎస్పీగా వున్న సెంథిల్‌కుమార్ తోలుపెరుకుతానని హెచ్చరించి ఈ పేకాట క్లబ్‌ను మూయించాడని తెలిసింది. మంత్రి నారాయణకు బెట్టింగ్స్, పేకాట అలవాటు లేకపోవచ్చు, కాని ఇలాంటి వారిని ప్రోత్స హించి చంకనెక్కించుకుంటే జిల్లాను గబ్బు పట్టించడమే కాకుండా మంత్రిగా తానూ గబ్బుపడుతున్నాడు. వీలైనంత త్వరగా ఆయన ఏదో ఒక ఇంటర్నేషనల్ బ్రాండ్ సబ్బు వాడైనా ఇలాంటి వారి గబ్బును వదిలించుకోకపోతే వ్యక్తిగత ప్రతిష్ఠ పరంగా చాలా నష్టపోతాడు. ఇతనే కాకుండా ఫండ్‌రైజర్లుగా ఆయా పార్టీలలోని మరికొందరు నాయకుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. బెట్టింగ్ భాగోతంలో ఎస్పీకి తాడు కొస ఓ వైపు దొరికింది. దానిని పట్టుకుని పరిశోధించుకుంటూ పోతున్నారు. ఈ పరిశోధనలోనే విభిన్న వ్యక్తుల పేర్లు బయటకు వస్తున్నాయి. ఎస్పీ తాడు లాగాడు, బెట్టింగ్ డొంక కదిలింది. ఎన్ని కొత్త ముఖాలు తెరపైకి వస్తాయో చూడాలి.

## బెట్టింగ్స్‌కు పాతరే లక్ష్యం...

జిల్లా నుండి బెట్టింగ్ భూతాన్ని శాశ్వతంగా తరిమికొట్టాలనే లక్ష్యంతో ఎస్పీ రామకృష్ణ పని చేస్తున్నారు. అందుకే విచారణ కూడా చాలా పద్ధతిగా చేసుకుంటూ పోతున్నారు. బెట్టింగ్స్ మూలంగా జిల్లాలో చాలామంది బ్రతుకులు నాశనమయ్యాయి. కొందరు ఆస్తులు అమ్ముకుని రోడ్డునపడ్డారు. కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యాపారాలు చేసుకుని పద్ధతిగా బ్రతికేవాళ్లు బెట్టింగ్ మాయలో పడి సర్వం కోల్పోయి దొంగలుగా మారారు. ఎందరి బ్రతుకులనో గుల్లగుల్ల చేస్తున్న ఈ బెట్టింగ్ భూతాన్ని తరిమి కొట్టడంలో ఎస్పీ రామకృష్ణ చేస్తున్న ప్రయత్నం విజయవంతం కావాలని ప్రజల ఆకాంక్ష!

# పనిచేయని ఎల్ఇడి బల్బులను మార్చుకోండి

విద్యుత్ సంస్థ గతంలో ఇచ్చిన పనిచేయని లేదా కాలిపోయిన ఎల్ఇడి బల్బులను మార్చుకుని కొత్తవి తీసుకునేందుకు వినియోగదారులకు అవకాశం కల్పించామని విద్యుత్ శాఖ(ఆపరేషన్స్) నెల్లూరుటౌన్ డివిజన్ డి.ఇ సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొదలకూరురోడ్డులోని డిఎస్ఆర్ సబ్‌స్టేషన్, కోటమిట్టలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఉదయం10 నుంచి సాయంత్రం 5గంటల వరకు బల్బులను మార్చుకోవచ్చని, చెడిపోయిన బల్బులతో పాటు విద్యుత్‌బిల్లును కూడా తీసుకురావాల్సి ఉంటుందన్నారు.

# సీట్ల పెంపుకు తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

నష్టం వాటిల్లవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతమున్న 175 అసెంబ్లీ సీట్లను 225కు పెంచాలనే ప్రతిపాదన వుంది. ఇంతకాలం చంద్రబాబుకు ఎన్నికలలోపు సీట్లు పెరుగు తాయనే ఆశ వుండింది. సీట్లు పెరిగితే అది రాజకీయంగా చంద్రబాబుకే ప్రయోజనం. పార్టీలో పాతవాళ్లతో పాటు కొత్తగా చేర్చుకున్న వాళ్లకు కూడా సీట్లు ఇవ్వొచ్చు. ప్రతిపక్ష పార్టీల నుండి ఇంకా బలమైన నాయకులను పార్టీలోకి లాక్కోవచ్చు.

అయితే చంద్రబాబు, కేసీఆర్ ఆశలకు కేంద్రంలోని బీజేపీ నాయకులు గండికొట్టినట్లుగా తెలుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో సీట్ల పెంపు ఫైలును మొన్నటివరకు కేంద్రమంత్రిగా వున్న వెంకయ్యనాయుడు ముందుకు కదిలిస్తూ వచ్చారు. ఈ రెండు రాష్ట్రాల పర్యటనలో పలుసార్లు ఆయన కూడా తెలుగురాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని గ్యారంటీగా చెప్పారు. కాని వెంకయ్యను ఉపరాష్ట్రపతిగా పంపిస్తుండడంతో ఇక ఈ సీట్ల పెంపు ప్రతిపాదన అటకెక్కినట్లుగానే కనిపిస్తోంది. రెండు తెలుగురాష్ట్రాలలో సీట్లను పెంచాలన్న ప్రతిపాదనపై మిగిలిన బీజేపీ నాయకులెవరూ ఆసక్తి చూపడం లేదు. తెలంగాణలో కేసీఆర్‌కు రాజకీయంగా ప్రయోజనం కలిగించే సీట్ల పెంపును ఆ రాష్ట్ర బీజేపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం బలపడడానికి దోహదపడే సీట్ల పెంపు బీజేపీకి అవసరం లేదు. ఇప్పటికే తెలుగుదేశంతో పొత్తు వల్ల ఈ రాష్ట్రంలో బీజేపీ బాగా నష్టపోయింది. అంతేకాకుండా ప్రతిపక్షంగా వున్న వైసిపి కూడా సీట్ల పెంపును వ్యతిరేకిస్తోంది. బీజేపీకి వైసిపి మిత్రపక్షం కాకపోయినప్పటికి శత్రుపక్షం మాత్రం కాదు. కాబట్టి ఆంధ్రాలోనూ హడావిడిగా సీట్లను పెంచాల్సిన అవసరమేమీ కేంద్రానికి కనిపించడం లేదు.


మొన్న రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణస్వీకారానికి ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు, కేసీఆర్‌లకు సీట్ల పెంపుపై కేంద్రపెద్దల నుండి ఎటువంటి హామీ రాలేదు. సీట్లను పెంచడం అంత సులభం కాదు. పార్లమెంటులో బిల్లును ఆమోదింపజేయాలి. రాజ్యాంగ సవరణ చేయాలి. పార్లమెంట్‌లో సీట్ల పెంపు బిల్లును అడ్డుకుంటామని యూపిఏ పక్షాలు ఇప్పటికే ప్రకటించాయి. రాజకీయంగా తమకు ఏ విధంగానూ ఉపయోగపడని సీట్ల పెంపు బిల్లును కేంద్రం కూడా ముందుకు తెచ్చే పరిస్థితి లేదు. ఈ విషయంలో ఇద్దరు చంద్రులకు నిరాశే మిగలనుంది!

# సోమిరెడ్డికి కీలక బాధ్యత

(5వ పేజీ తరువాయి)

కేశవరెడ్డిది ఈ ప్రాంతమే! ఈ ప్రాంతంలో కేశవరెడ్డి బాధితులు పెద్దఎత్తునే వున్నారు. ఆదినారాయణరెడ్డి ప్రచారంలో తిరిగితే కేశవరెడ్డి బాధితులలో తెలుగుదేశంపై వ్యతిరేకత వస్తుంది. ఈ దశలో చంద్రబాబు వీరిద్దరిని నంద్యాలకు దూరం పెట్టాడని తెలుస్తోంది. 'రెడ్డి' వర్గం నుండి భూమా అఖిలప్రియ మంత్రిగా వున్నప్పటికీ నంద్యాలలో రెడ్లపై ఆమె ప్రభావం తక్కువే! అదీగాక వైసిపిలో గెలిచి తెలుగుదేశంలో చేరిందని ప్రజల్లో వ్యతిరేకత వుంది. కాబట్టి 'రెడ్ల' ఓట్ల కోసం చంద్రబాబు ఆమెపై కూడా ఆధారపడలేదు.

తెలుగుదేశం ప్రభుత్వంలో నలుగురు మంత్రులు 'రెడ్లు' వుంటే ముగ్గురు వైసిపి నుండి తెలుగుదేశంలో దూరినోళ్లే! ఏమైనా నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డే ఒరిజినల్ తెలుగుదేశం 'రెడ్డి' నాయకుడు. సబ్జెక్ట్ వున్నోడు. అవతల వాళ్లకు చెప్పాల్సిన రీతిలో చెప్పి తనవైపు తిప్పుకోగలడు. మొన్న కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే సోమిరెడ్డి టాలెంట్‌పై చంద్రబాబుకు గురి ఏర్పడింది. నంద్యాలలో రెడ్లను ఆకర్షించడానికి సోమిరెడ్డి అయితేనే కరెక్ట్ అని చెప్పి చంద్రబాబు ఉపఎన్నికల్లో సోమిరెడ్డి టాలెంట్‌ను బాగానే పిండేస్తున్నాడు.

కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.


01-08-2017 మంగళవారం ఆ మహనీయుని 40వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ

మనుమడు
మాగుంట విజయ్‌రెడ్డి

## ఇరుపార్టీల నేతలకు టెన్షన్...

# ఏపీలో ఇక ఏం జరగబోతుంది?



**మన రాష్ట్ర రాజకీయాలకు, కేంద్రంలో జరిగిన, జరుగుతున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఏదో లింకువుంది. ఇప్పటికే రాష్ట్రపతి ఎన్నిక ముగిసింది. ఎన్డీఏ అభ్యర్థికే రాష్ట్రంలోని అధికార, విపక్ష పార్టీలు రెండూ ఓటేశాయి. అలాగే ఉపరాష్ట్రపతికి కూడా ఇరు పార్టీలు మద్దతు పలికాయి.**



ఉపరాష్ట్రపతి ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఏవో ఊహించని పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్రంలో ప్రధాని మోడీ అంటే భయపడుతున్న ప్రాంతీయ పక్షాలన్నీ కూడా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతు ప్రకటించాయి. తెలంగాణలో జరిగింది అదే! మన రాష్ట్రంలో జరిగింది కూడా అదే! కొన్ని ప్రాంతీయపార్టీలు ప్రధాని నరేంద్రమోడీ దెబ్బకు జడిసే ఆయన ప్రతిపాదించిన రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు తెలిపాయనే వాదన లేకపోలేదు. రాష్ట్రపతి ఎన్నికల్లో అన్ని పార్టీల సహకారం కూడా అవసరం కాబట్టి బీజేపీ అధినాయకత్వం ఆయా రాష్ట్రాల రాజకీయాల్లో వేలుపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలలో బలం పెంచుకోవడం పై కాషాయదండు దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. తమిళనాడు రాజకీయాలను ఇప్పటికే కలబెట్టారు. రాష్ట్రపతి ఎన్నికలు ముగిసాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల తర్వాత అక్కడ పెను రాజకీయ మార్పులు సంభవించే సూచనలున్నాయి. తెలంగాణలో కేసీఆర్‌ను తొక్కడం వారికి ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు. కాబట్టి ఆ రాష్ట్రంలో కేసీఆర్‌తో కలిసిపోయి సీట్లు పెంచుకోవడమా లేక కేసీఆర్‌తో కొట్లాడి ఇప్పటివరకు ప్రతిపక్షంగా వున్న కాంగ్రెస్ స్థానాన్ని ఆక్రమించడమా? ఈ రెండింటిలో ఖచ్చితంగా ఒకటి జరుగుతుంది.

అన్నింటికంటే బీజేపీ అగ్రనేతల లక్ష్యం ఆంధ్రప్రదేశ్‌గా కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికార, విపక్షాలుగా వున్న తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌లు ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థికే మద్దతు పలికాయి. కేంద్రంలో బీజేపీతో ఈ రెండు పార్టీల అధినేతలు చంద్రబాబు, జగన్‌లు సఖ్యతనే కోరుకుంటున్నారు. ఇప్పటికిప్పుడు మోడీతో పేచీ పెట్టుకోవాలనే ఆలోచన వారికి లేదు. దీనికి వారి కారణాలు వాళ్ళకున్నాయి. దేశంలో మోడీ ఇమేజ్ పెరిగింది. కాబట్టి బీజేపీతో పొత్తు పెట్టుకుంటే రాజకీయంగా లాభమే కాని నష్టం లేదని ఇద్దరికీ తెలుసు. ఇది రాజకీయ పరమైన ఆలోచన. ఇక రెండోది ఇద్దరి మీద కేసులున్నాయి. చంద్రబాబు మీద ఓటు-నోటు కేసు బలంగా వుంది. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వాన్ని బలహీనపరచాలనుకుంటే కేంద్రం ఈ ఒక్క కేసును కోర్టు మెట్లెక్కిస్తే చాలు. జేఎంఎం ఎంపీలను కొనుగోలు చేసిన స్వర్గీయ పి.వి.నరసింహారావు ఎన్ని అవస్థలు పడ్డాడో తెలియంది కాదు. చంద్రబాబు అందుకు మినహాయింపు కాదు. 'ఓటు-నోటు' కేసు నుండి బయటపడేందుకు, దానిని ఎక్కడ తిరగ తోడి తన మీదకు ఉసిగొల్పుతారేమోననే భయంతో ఆయన బీజేపీని వదలడం లేదు. ఇక జగన్ మీద అక్రమ ఆస్తుల కేసులు రన్నింగ్‌లో వున్నాయి. వై.యస్. పరిపాలనా వ్యవహారాలలో జగన్ ప్రత్యక్ష ప్రమేయం ఎక్కడా లేదు. సోనియాగాంధీ కక్షకొద్ది పెట్టిన కేసులివి. ఇప్పుడు జగన్‌ను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలంటే కేంద్రం ఈ కేసులను బాగానే వాడుకోవచ్చు. తన మీదున్న కేసుల దృష్ట్యా కూడా జగన్ బీజేపీతో సఖ్యతగా ఉంటున్నాడనిపిస్తోంది.

చంద్రబాబు, జగన్‌లిద్దరు కూడా ప్రధానంగా కేసుల దృష్టితోనే బీజేపీతో చెలిమికి సిద్ధమవుతున్నారు. మరి ఈ రాష్ట్రంలో బీజేపీ ఎవరికి ప్రాధాన్యతనివ్వనుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకైతే తెలుగుదేశంతోనే పొత్తుంది. అయితే ఈ రాష్ట్రంలో బీజేపీతో పొత్తు వల్ల టీడీపీ లాభపడిందేగాని, టీడీపీతో పొత్తు వల్ల బీజేపీకి ఒరింగిదేమీ లేదు. అదీగాక 1983లో వున్నంత బలంగా కూడా రాష్ట్రంలో బీజేపీ ఇప్పుడు లేదు. దీనికి కారణం తెలుగుదేశం నీడలో ఎదగలేకపోవడమే! ఆదే వైసిపితో అయితే రాష్ట్రంలో ముమ్ముందు బలం పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో అన్ని అవకాశాలను పరిశీలించాకే, ఉపరాష్ట్రపతి ఎన్నికలు ముగిసిన తర్వాత బీజేపీ అధిష్టానం రాష్ట్ర రాజకీయాలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

## ఉపరాష్ట్రపతిగా...

# తొలిపర్యటన నెల్లూరులోనే!

- మొదట విజయం
- వెంటనే వెంకన్న దర్శనం
- ఆపై నెల్లూరు పయనం
- ఆగస్టు 7న మేధావులు, విద్యార్థులు, వెంకయ్య అభిమానులతో భారీ సభ
- 11న ప్రమాణస్వీకారం



***ఆయనకు నెల్లూరంటే ఇష్టం... నెల్లూరును వదిలి వుండాలంటే కష్టం... నెల్లూరు గాలి పీల్చడం ఆయన అదృష్టం... ఆయన మనసంతా నెల్లూరే! దేశంలో ఏ మారుమూల తిరుగుతున్నా ధ్యాసంతా నెల్లూరు మీదే వుంటుంది. ఏ పదవిలోవున్నా, ఎంతగా తీరికలేని పని ఒత్తిడితో వున్నా కాని, రెండు నెలలకోసారైనా నెల్లూరుజిల్లాకు రానిదే, ఈ గాలి పీల్చనిదే, ఈ పెన్న నీళ్లు తాగనిదే, ఇక్కడి మొలగొలుకుల అన్నం తిననిదే ఆయన మనసుకు వూరట వుండదు.***

ఏ పదవిలో వున్నా, ఏ స్థాయిలో వున్నా నెల్లూరును అంతగా ఆరాధించి, అంతగా ప్రేమించి, అంతగా అభిమానించే నాయకుడు మన ముప్పవరపు వెంకయ్యనాయుడు దేశంలోనే రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యాక తన తొలి పర్యటనకు తనకిష్టమైన నెల్లూరునే ఎంచుకున్నాడు. ఉపరాష్ట్రపతి పదవికి ఆగస్టు 5వ తేదీన ఎన్నిక జరుగుతుంది. అదేరోజు ఫలితాలు వెల్లడిస్తారు. పార్లమెంటులో వున్న కూటముల బలాబలాలను చూస్తే ఉపరాష్ట్రపతిగా వెంకయ్య గెలుపును ఎవరూ ఆపే పరిస్థితి లేదు. కాబట్టి ఆయన ఎన్నిక లాంఛనమే అనుకోవచ్చు. 6వ తేదీ ఢిల్లీ నుండి బయలుదేరి తిరుమల వెంకన్న దర్శనార్థం తిరుమలకు చేరుకుంటారు. ఆ రాత్రికి వెంకన్న సన్నిధిలోనే నిద్ర చేస్తారు. 7వ తేదీ ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుపతి ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరి మధ్యాహ్నం 3.30గంటలకు నెల్లూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో దిగుతారు. ఆరోజు సాయంత్రం 6గంటలకు నెల్లూరులోని విఆర్ హైస్కూల్ మైదానంలో మేధావులు, విద్యార్థులు, వెంకయ్య అభిమానులతో నిర్వహించే ఆత్మీయ అభినందన సభలో ఒక రాజకీయ నేతగా కాకుండా తొలిసారిగా ఒక రాజ్యాంగ అధిపతిలా పాల్గొని తన సందేశమిస్తారు. అలాగే అక్కడే నెల్లూరుజిల్లాకు చెందిన ప్రముఖులను, చిరకాల మిత్రులను కలుసుకుని ముచ్చటిస్తారు.

ఉపరాష్ట్రపతి హోదాలో ఆయన తొలిపర్యటనకు నెల్లూరునే ఎంచుకోవడం విశేషం. అయితే ఇప్పటిదాకా మనం చూసిన వెంకయ్య వేరు, రేపటి నుండి ఉపరాష్ట్రపతిగా మనం చూడబోయే వెంకయ్యనాయుడు గారు వేరు! ప్రాసలతో, జాలువారే మాటలతో, కనికట్టు లాంటి పదాలతో ప్రత్యర్థులను ఉతికి ఆరేసిన వెంకయ్యను ఇక నుండి మనం కొత్తకోణంలో చూడబోతున్నాం. రాజకీయాలకతీతంగా, అందరివాడిగా వ్యవహరించే రాజ్యాంగ రక్షకుడి పాత్రలో వెంకయ్య నాయుడును చూడడానికి సిద్ధమవుదాం. ఉపరాష్ట్రపతి హోదాలో తొలిసారిగా నెల్లూరుకు విచ్చేయనున్న వెంకయ్యనాయుడుకు స్వాగతం పలికేందుకు ఆయన అభిమానులు, రాజకీయాల కతీతంగా జిల్లా నేతలు, వివిధ రంగాల ప్రముఖులు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల నుండి పెద్దసంఖ్యలో విద్యార్థులు ఆయన ఆత్మీయ అభినందన సభకు హాజరుకానున్నారు. నెల్లూరును, నెల్లూరు ప్రజల్ని తనివితీర చూసి పలుకరించి వెళ్లాకే ఈ నెల 11వ తేదీన భారత 14వ ఉపరాష్ట్రపతిగా ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు.

# దోమలపై దండయాత్ర



పలు ప్రాణాంతక వ్యాధులకు దోమలే కారణమని, ప్రజలు సహకరిస్తే... దోమలను నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీన యాక్ట్ సిటి ఛానెల్ వారు సిఎస్ఆర్ నిధుల క్రింద 8లక్షల50వేల వ్యయంతో నెల్లూరు నగరపాలక సంస్థకు సమకూర్చిన ఫాగింగ్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వారానికి ఒకసారి తమ ఇంట్లో దోమలు నివసించే ప్రాంతాన్ని పరిశీలించి, వాటిని మళ్ళీ రాకుండా చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై ప్రతిఒక్కరూ దృష్టిపెట్టాలని చెప్పారు. ఫాగింగ్ మిషన్ అందజేసిన యాక్ట్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలో దోమల నిర్మూలనకు 4 ఫాగింగ్ వాహనాలు అవసరమని, ఒక వాహనాన్ని యాక్ట్ వారు ఇచ్చారని, దాతలు ముందుకు వచ్చి మిగతా మూడు వాహనాలు సమకూరిస్తే దోమలపై సంపూర్ణంగా దండయాత్ర చేయవచ్చన్నారు. ఇళ్ళ పరిసరాలలో దోమలు నిలవకుండా ఉండేందుకు పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు, యాక్ట్ ఆపరేషన్ హెడ్ డి.వి.సుబ్బారావు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com